www.trinetnews.com
తెలంగాణ ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
సంపుటి 01 సంచిక 22 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు మంగళవారం సెప్టెంబర్ 01, 2026 పేజీలు:12 వెల.10/-

**రాష్ట్రపతి వద్ద విధులు.. 12 ఏళ్లకే రిటైర్మెంట్: ఎవరీ మేజర్ రిషభ్..?**



2లో

**హరికథ ప్రక్రియకు సాహిత్యం లో ఉన్నత స్థాయి కల్పించిన ఆదిభొట్ల**



12

# కేసీఆర్ కోసం రూ.21 కోట్లు ఖర్చు

## కేసీఆర్ వెంటనే పదవికి రాజీనామా చేయాలి

- సెక్యూరిటీ, ఇల్లు, వాహనాలకు రూ.21 కోట్లు
- '365 రోజులు విధులకు రాకపోతే ఉద్యోగి డిస్మిస్'
- బీఆర్ఎస్ హయాంలో రూ.8.11 లక్షల కోట్ల అప్పులు
- మూసారాంబాగ్ బ్రిడ్జిని రెండేళ్లలో పూర్తి చేశాం
- అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు
- చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నాం: సీఎం
- 1000 రోజులకు రూ.1.24 కోట్ల జీతం తీసుకున్నారు



2లో

హైదరాబాద్: ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31
రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికబద్ధంగా రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించి అనంతరం మాట్లాడారు.

"అంబర్‌పేటలో ఏ కార్యాలయాలూ లేవు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంచెం వర్షం వస్తే మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగేది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు బ్రిడ్జి కట్టలేకపోయింది? మేం రెండేళ్లలోనే వంతెనను పూర్తి చేశాం. ఊరి బయట పది కిలోమీటర్ల అవతల డబుల్ బెడ్ రూంలు కడితే ఇక్కడ ఉన్న వాళ్లకు అవి ఎలా ఉపయోగపడతాయి? అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టాలని కంకణం కట్టుకున్నాం. బతుకమ్మ కుంటను కబ్జా చేయడానికి ప్రయత్నం చేసింది ఎవరో తెలియదా? ఈరోజు బతుకమ్మ కుంట పేదలకు అంకితం అయింది. విమానం నుంచి పూలు చల్లిన ఎడ్ల సుధాకర్.. మళ్లీ బతుకమ్మ కుంటను ఆక్రమించాలని చూస్తున్నారు. ఆయన వెనుక ఉన్నదెవరో ఆలోచించాలి.

హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. 2023 డిసెంబర్ 7న మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి. ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తయింది. రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు మేం కట్టలేదు.

మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఏడో తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రూ.70 వేల కోట్ల అప్పును.. 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు. 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు. కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మధ్య మధ్యలో నన్ను బెదిరిస్తున్నారు.

# తెలంగాణ నీటి హక్కులపై ఏపీ దండయాత్ర!

- బేసిన్ దాటి కృష్ణా జలాల తరలింపు
- వెలిగొండ ద్వారా ఏపీ నీటి తరలింపు
- రేవంత్ సర్కార్ ఎందుకు మౌనం?
- తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నాయ్
- కేఆర్ఎంబీ ప్రేక్షక పాత్రపై హరీశ్ ఆగ్రహం
- తెలంగాణ వాటా కాపాడాలని డిమాండ్
- కిషన్‌రెడ్డి వెంటనే స్పందించాలి: హరీశ్‌రావు



2లో

హైదరాబాద్: ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31
నీటి కేటాయింపులు లేకున్నా.. వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తుండటం తెలంగాణకు తీరని ద్రోహమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. "ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోంది.



## ముసారాం బ్రిడ్జిని ప్రారంభించిన సీఎం రేవంత్

హైదరాబాద్: ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31
మూసారం బాగ్ బ్రిడ్జిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.(సోమవారం)అంబర్‌పేటలో సీఎం రేవంత్ దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలేరు వెంకటేష్, శ్రీ గణేష్, నవీన్ యాదవ్, బలాల తదితరులు పాల్గొన్నారు.మూసీవరదలతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. లక్ష 50 వేల క్యూసెక్కుల వరద నీటిని తట్టుకునేలా బ్రిడ్జిని నిర్మించారు. దీని ప్రారంభంతో ఇక వర్షాకాలంలో వాహనదారులకు ఇక్కట్లు తప్పనున్నాయి.



## విజయ్.. ఐరాస చీఫ్ కూడా అవుతారేమో!.. డీఎంకే ఎద్దేవా

తమిళనాడు సీఎం విజయ్‌ను 2029 ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థి గా టీవీకే పార్టీ ప్రచారం చేస్తుండడం అక్కడి రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రచారాలపై ప్రతిపక్ష డీఎంకే పార్టీ విమర్శలు గుప్పిస్తుండగా.. మిత్రపక్షమైన కాంగ్రెస్ సైతం వ్యతిరేకిస్తోంది.

## బీజేపీ ఆఫీసుపై దాడి.. పోలీసులేం చేస్తున్నారు?

» ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా?: బండి
» పట్టపగలు దాడి చేస్తుంటే తమాషా చూస్తున్నారా?
» యూత్ కాంగ్రెస్ అరాచకాన్ని అడ్డుకోలేరా?
» పోలీసుల వైఫల్యానికి మూల్యం తప్పదు
» బాధ్యులను సాయంత్రంలోపు అరెస్ట్ చేయాలి
» లేకపోతే ప్రతిచర్యలు తప్పవు: బండి సంజయ్
» కాంగ్రెస్ కార్యాలయాలను దిగ్బంధిస్తాం



2లో..

హైదరాబాద్: ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31
తెలంగాణ రాష్ట్రంలో అసలు ఇంటెలిజెన్స్ వ్యవస్థ పని చేస్తోందా? అని ప్రశ్నించారు కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్. బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే పోలీస్ వ్యవస్థ ఏమైపోయిందని నిలదీశారు.

## కోమటిరెడ్డి ఆఫీసుపై బీజేపీ దాడి



మిగతాది 2లో

- కోడిగుడ్లు, టమాటాలతో నిరసన
- ఆఫీసును తగలబెట్టే యత్నం
- ప్రతీకారంగా కాంగ్రెస్ శ్రేణుల దాడులు
- బీజేపీ ఆఫీసుపై కాంగ్రెస్ దాడి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఇంటిపైనా దాడి
- హైదరాబాద్ నుంచి నల్లగొండకు పాకిన ఉద్రిక్తత
- ఇరువర్గాల ఆందోళనలతో హైటెన్షన్



2లో

## సీడ్ గణేశుడిని పూజించండి.. చిరంజీవి పిలుపు

హైదరాబాద్: ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31
ప్రకృతి సంరక్షణ కోసం, పచ్చదనం పెంపుకోసం ఈ సారి అందరూ సీడ్ గణేశుడిని పూజించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. సీడ్ గణేశుడిని పూజించి ఆ తర్వాత ఇంట్లోనే నిమజ్జనం చేయడం వల్ల.. వినాయకుడు మొక్కై ఎదిగి మనల్ని ఆశీర్వదిస్తాడని తెలిపారు.

## భాజపా కార్యాలయం ముట్టడికి యత్నం.. రామచందర్‌రావు ఆగ్రహం



మిగతాది 2లో

హైదరాబాద్: ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31
భాజపా కార్యాలయాన్ని యూత్ కాంగ్రెస్ ముట్టడికి యత్నించడంపై ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై భాజపా చేసిన దీక్షకు పెద్దఎత్తున యువత, విద్యార్థులు మద్దతు తెలిపారని.. దీనిని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందన్నారు.



## ప్రశాంత్‌రెడ్డికి నా ఉసురు తగులుతుంది

- ప్రశాంత్‌రెడ్డి శకుని పాత్ర పోషించారు
- తండ్రి--బిడ్డను విడదీయడంలో ఆయనదే కీలక పాత్ర
- 'ప్రశాంత్‌రెడ్డిని మాత్రం క్షమించను'
- తిహాడ్ జైలులో ఎందుకు పెట్టారు?
- ఈడీ, సీబీఐతో నాలుగేళ్లు వేధింపులు
- పార్టీ నుంచి ఎందుకు బహిష్కరించారు?
- కన్నీళ్లు పెట్టుకున్నానని పిరికిదాన్ని అనుకోవద్దు: కవిత

2లో..



## అసలు ఎథిక్స్ లేనిది ఎవరికి?

- ఎథిక్స్ కమిటీపై కౌశిక్‌రెడ్డి ఫైర్
- పార్టీ మారిన ఎమ్మెల్యేలకా? నాకా?
- గెలిపించిన పార్టీ వైపే నిలబడుతున్నా
- 'అమ్ముడుబోయినోళ్లకా.. మాకా?'
- ఎథిక్స్ కమిటీనే ఆలోచించుకోవాలి
- ప్రభుత్వ హామీలపై సెప్టెంబర్ 2 నుంచి నిరసనలు
- ఈ నెల 8 తర్వాత మరింత స్పందిస్తా: కౌశిక్‌రెడ్డి

2లో

హైదరాబాద్: ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31
ఎథిక్స్ కమిటీ విచారణపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మండిపడ్డారు. అసలు ఎథిక్స్ లేంది ఎవరికి అంటూ ప్రశ్నించారు.




## చంచల్‌గూడ జైలులో ఖైదీ ఆత్మహత్య

హైదరాబాద్:
చంచల్‌గూడ జైల్లో ఖైదీ ఆత్మహత్య చేసుకున్నారు. రిమాండ్ ఖైదీగా ఉన్న కందిసాగర్ అనే వ్యక్తి (సోమవారం) జైలులో ఊరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే అతడి ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలేంటి అనే వివరాలు తెలియాల్సి ఉంది.

# అసలు ఎథిక్స్ లేనిది ఎవరికి?

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి.. కాం?గ్రెస్ పార్టీ కండువా కప్పుకుని తిరిగేటోళ్లకా? లేక అధికారంలో లేకపోయినా ఏ పార్టీ నుంచి అయితే గెలిచామో అ పార్టీ వైపే నిలబడి ప్రజా సమస్యలపై కొట్లాడేటోణికా..? అని నిలదీశారు. అసలు ఎథిక్స్ ఉన్నది ఎవరికీ..? మాకా, అమ్ముడుబోయినోణికా? అంటూ సూటిగా ప్రశ్నించారు.

హుజురాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాడ్ కౌశిక్ రెడ్డి మీడియా సమావేశం జరిగింది. ఇందులో ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంపై సెప్టెంబర్ 2 నుండి చేపట్టే బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా మాట్లాడుతూ.. ‘ అసలు ఎథిక్స్ నాకు లేవా.. పిటిషన్ ఇచ్చినోళ్లకా?, ఈ విషయంపై ఈ నెల 8వ తేదీ తర్వాత మరింత స్పందిస్తా. ఎథిక్స్ కమిటీనే ఆలోచన చేసుకోవాలి ఎవరికి ఎథిక్స్ ఉన్నాయో?’ అని పేర్కొన్నారు.

# ప్రశాంత్‌రెడ్డికి నా ఉసురు తగులుతుంది: కవిత

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తాను ఏ తప్పూ చేయకున్నా తిహాడ్ జైలులో పెట్టారని అన్నారు. తండ్రిని బిడ్డను వేరుచేయడంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిదే మొదటి పాత్ర అని దుయ్యబట్టారు. ఆయన శకుని పాత్ర పోషించినట్లు ఆరోపించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సభలో కవిత మాట్లాడుతూ కంటతడి పెట్టారు. “హరీశ్‌రావునో, సంతోష్‌రావునో క్షమిస్తానేమో గానీ.. ప్రశాంత్‌రెడ్డిని మాత్రం క్షమించను. ఆయనకు నా ఉసురు తగులుతుంది. ప్రశాంత్‌రెడ్డిని కేసీఆర్ కుమారుడిలా చూసుకుంటే.. ఆయన మా మధ్య చిచ్చుపెట్టారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిన రెండో రోజే ఆయన కాంగ్రెస్ పార్టీతో మాట్లాడారు. ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. నెల రోజులు అమెరికాలో ఉండి వేం నరేందర్‌రెడ్డితో సంప్రదింపులు చేశారు.

ప్రశాంత్‌రెడ్డికి ప్రజా జీవితం లేదు. ఆయన బాల్కొండ నుంచి పారిపోవాలి. ప్రశాంత్‌రెడ్డి వైఖరి పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లుగా ఉంది. ఆయన మంత్రి కావడానికి నేను ఎంతో ప్రయత్నం చేశా. ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి, ఆనాటి బోధన్ ఎమ్మెల్యేను గెలిపించడానికి ఎంతో కష్టపడ్డాను. అయితే వారందరూ నన్ను పరాజితురాలిని చేశారు. నేను ఏం తప్పు చేశానని తిహాడ్ జైలులో పెట్టారు? నిజామాబాద్ జిల్లా కోడలిగా ఉద్యమం చేసిన నన్ను నాలుగేళ్లు ఈడీ, సీబీఐ వేధింపులకు గురిచేశాయి. చివరకు నేను ఏ తప్పు చేయలేదని తేలింది. నన్ను ఎందుకోసం పార్టీ నుంచి బహిష్కరించారు? తెలంగాణ రక్షణ సేన.. పదవుల కోసం పెట్టిన పార్టీ కాదు. కన్నీళ్లు పెట్టుకున్నానని నేను పిరికిదాన్ని అనుకోవద్దు” అని కవిత చెప్పారు.

# బీజేపీ ఆఫీసుపై దాడి.. పోలీసులేం చేస్తున్నారు?

మొదటిపేజీ తరువాయి

ఇంత జరుగుతుంటే పోలీసులు తమాషా చూస్తున్నారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూత్ కాంగ్రెస్ అరాచకం చేస్తుంటే పోలీసులు పట్టించుకోరా అంటూ ధ్వజమెత్తారు. పోలీసుల వైఫల్యానికి మూల్యం చెల్లించుకోక తప్పదంటూ హెచ్చరించారు బండి సంజయ్.

‘బీజేపీ ఆఫీస్ వద్ద ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం చేసి, కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు?, రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా?పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే పోలీసులు తమాషా చూస్తున్నారా?, కాంగ్రెస్‌కు తొత్తులుగా పనిచేస్తున్నారా?, నగరం నడిబొడ్డునున్న జాతీయ పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని రక్షణ కల్పించే బాధ్యత మీకు లేదా?, యూత్ కాంగ్రెస్ నేతలు అరాచకం చేస్తుంటే అక్కడ పోలీసులెందుకు లేరు?, పోలీసుల వైఫల్యానికి మూల్యం చెల్లించక తప్పదు. మా సహనాన్ని చేతగానితనంగా భావిస్తే తీవ్ర పరిణామాలుంటాయ్. ఖబడ్దార్ కాంగ్రెస్ నేతలారా.... మేం తలుచుకుంటే బయట తిరగలేరు.

సాయంత్రంలోపు బాధ్యులను అరెస్ట్ చేసి చట్టం ముందు నిలబెట్టాలి. లేనిపక్షంలో యూత్ కాంగ్రెస్ నేతల చర్యకు మించి ప్రతి చర్యలుంటాయ్. బీజేవైఎం కార్యకర్తలు తలుచుకుంటే యూత్ కాంగ్రెస్ నేతలు బయట తిరగలేరు. కాంగ్రెస్ నాయకత్వం తక్షణం స్పందించాలి. లేకపోతే కాంగ్రెస్ కార్యాలయాలను బీజేపీ శ్రేణులు దిగ్బంధిస్తాం. జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది’ అని హెచ్చరించారు.

# తెలంగాణ నీటి హక్కులపై ఏపీ దండయాత్ర!

మొదటిపేజీ తరువాయి

కృష్ణా బేసిన్‌లో భాగమైన భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టులు ఎండిపోతుంటే.. మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యథేచ్ఛగా నీటిని తరలిస్తోంది.

మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ! తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు? రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహం ఇది. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు? ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబీ సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థ ప్రేక్షకపాత్ర పోషిస్తే.. రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి? కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే స్పందించాలి. కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం” అని హరీశ్ రావు అన్నారు.

# విజయ్.. ఐరాస చీఫ్ కూడా అవుతారేమో!.. డీఎంకే ఎద్దేవా

మొదటిపేజీ తరువాయి

అసలేమైందంటే?

టీవీకే సీనియర్ నేత, రెవెన్యూశాఖ మంత్రి కె.ఎ.సెంగోట్టైయన్ ఇటీవల తిరుప్పూర్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ తాను ఎంజీఆర్, జయలలితతో కలిసి పనిచేశానని, విజయ్ వారికి మించిన శక్తిగా ఉన్నారంటూ కొనియాడారు. ఆయన తమిళనాడుకే పరిమితం కారని, దేశాన్ని సైతం పాలిస్తారని వ్యాఖ్యానించారు. ఇటీవల టీవీకే చేసిన ఓ సర్వేలోనూ మోదీ, రాహుల్ గాంధీ తర్వాత ప్రధాని అయ్యే అవకాశం విజయ్‌కు ఉందని తేలింది. దీంతో టీవీకే నేతలు విజయ్‌ను భావి ప్రధానిగా అభివర్ణిస్తున్నారు. దీనిపై డీఎంకే కార్యదర్శి భారతి స్పందిస్తూ.. ఊహించుకోవడానికి హద్దుల్లేవు గనక వారు ఏమైనా అనుకుంటారంటూ విమర్శలు గుప్పించారు. విజయ్‌ను ఐరాస అధిపతిని చేస్తామని కూడా అంటారేమో అని ఎద్దేవా చేశారు.

టీవీకే ప్రచారాన్ని కాంగ్రెస్ సైతం తప్పుబట్టింది. 2029 ఎన్నికల్లో తమ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని అభ్యర్థిగా నిలబడతారని.. టీవీకే ఆయనకు మద్దతు ఇవ్వకపోతే తమిళనాడు మంత్రివర్గం నుంచి వైదొలుగుతామని సీనియర్ నేత మాణికం ఠాగూర్ హెచ్చరించారు. ప్రతి సర్వే ప్రజాభిప్రాయాలను ప్రతిబింబించదని పేర్కొన్నారు. 2029 సార్వత్రిక ఎన్నికల విషయంలో తమ పార్టీకి స్పష్టమైన ప్రణాళిక ఉందన్నారు. విజయ్‌కు మిత్రపక్షంగా ఉన్న ఎండీఎంకే సైతం ఈ వార్తలను వ్యతిరేకించింది. ఇండియా కూటమి తరఫున ప్రధాన మంత్రి అభ్యర్థిగా రాహుల్ గాంధీ మాత్రమే ఉంటారని తెలిపింది. ప్రధాని కావాలని విజయ్ ఆశిస్తారని కూడా తాము

# కోమటిరెడ్డి ఆఫీసుపై బీజేపీ కార్యకర్తల దాడి

మొదటిపేజీ తరువాయి

జిల్లా కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఆఫీసుపై బీజేపీ కార్యకర్తలు కోడిగుడ్లు, టమాటాలతో విరుచుకపడ్డారు. అనంతరం మంత్రి ఆఫీసును తగలబెట్టే యత్నం చేశారు. తమ పార్టీ ఆఫీసుపైకి వస్తే ప్రతిఘటన తప్పదని బీజేపీ శ్రేణులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. దీనికి ప్రతిగా కాంగ్రెస్ నాయకులు సైతం దాడికి తెగబడ్డారు. నల్లగొండ బీజేపీ ఆఫీసుపై దాడికి తెగబడ్డారు. జిల్లా అధ్యక్షుడి ఇంటిపై దాడి చేశారు. దీంతో జిల్లా కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

**అసలు ఏమైంది**

ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయం ముట్టడికి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. వారిని పోలీసులు అడ్డుకోవడంతో కార్యాలయం వద్ద కొద్దిసేపు హైటెన్షన్ వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు ‘కాంగ్రెస్ జిందాబాద్’ అంటూ నినాదాలు చేశారు ఈ క్రమంలో అమిత్ షా దిష్టిబొమ్మను కాంగ్రెస్ కార్యకర్తలు దగ్ధం చేశారు. అనంతరం బీజేపీ కార్యాలయం ముట్టడికి వెళ్లిన యూత్ కాంగ్రెస్ నేతలు.. బీజేపీ ఆఫీస్ గేట్లకు నల్లరంగు పూయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

అనంతరం దీనికి ప్రతికారంగా గాంధీ భవన్ ముట్టడికి బీజేవైఎం నేతలు ప్రయత్నించారు. గాంధీ భవన్ వైపు వచ్చిన పలువురు బీజేవైఎం నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఇరువర్గాల ఆందోళనల నేపథ్యంలో గాంధీ భవన్‌పై దాడి జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గాంధీ భవన్ చుట్టుపక్కల భారీగా పోలీసులను మోహరించారు. దీంతో ఆ ప్రాంతంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి ఆఫీసుపై మరోసారి బీజేపీ శ్రేణులు దాడి చేశారు.

# భాజపా కార్యాలయం ముట్టడికి యత్నం.. రామచందర్‌రావు ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి

యువత, విద్యార్థులను పక్కదారి పట్టించేందుకు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు.. తమ పార్టీ ఆఫీస్‌ను ముట్టడికి యత్నించారని విమర్శించారు. తమ కార్యాలయంపై నల్లరంగు పూయడం వారి అవివేకం అన్నారు.

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంది తప్పితే.. పార్టీ కార్యాలయం, నేతల ఇళ్ల మీద దాడి చేయడం సరైంది కాదన్నారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన దానికి ఇప్పుడు యూత్ కాంగ్రెస్ ముట్టడించేందుకు రావడం ఏంటని ప్రశ్నించారు. బిహార్‌లో ఏదో జరిగితే కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఏం సంబంధమో చెప్పాలన్నారు. భాజపా కార్యాలయం, నేతల ఇళ్ల మీదకు వస్తే కాంగ్రెస్ కార్యకర్తలను రోడ్ల మీద తిరగనివ్వమని హెచ్చరించారు.

మరోవైపు కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం గాంధీ భవన్‌ను ముట్టడించేందుకు బీజేవైఎం కార్యకర్తలు విఫలయత్నం చేశారు. పలువురు కార్యకర్తలు గాంధీభవన్ సమీపంలోకి రాగానే పోలీసులు అడ్డుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారంతో పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు బీజేవైఎం కార్యకర్తలను అడ్డుకున్నారు.

# కేసీఆర్ కోసం రూ.21 కోట్లు ఖర్చు

మొదటిపేజీ తరువాయి

మేం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారైనా ఒకటో తేదీనా జీతాలు ఇవ్వకుండా ఉన్నామా? ఆనాడు పరిపాలన ఎలా ఉందో.. నేడు ఏవిధంగా ఉందో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలి.

**కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి**

ఉస్మానియా ఆసుపత్రిని 2 వేల పడకలతో రూ.3000 కోట్లతో కడుతున్నాం. వచ్చే ఏడాదిలో ప్రారంభిస్తాం. సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రిచెన్నారెడ్డి పేరు, అల్వాల్‌లో ఉన్న టిమ్స్‌కు టి.అంజయ్య పేరు, తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు ఎల్బీనగర్ టిమ్స్‌కు, వరంగల్‌లో ఉన్న టిమ్స్‌కు ప్రొ.జయశంకర్ పేరు పెడతాం. తెలంగాణ అమరుడు శ్రీకాంత్‌చారి కుటుంబాన్ని కేసీఆర్ పట్టించుకోలేదు. బ్రిటిష్ హయాంలో 1931లో కులగణన చేస్తే.. 100 ఏళ్లలో ఈ దేశంలో ఏ నాయకుడు ఆ ధైర్యం చేయలేదు. జనగణన, కులగణన చేస్తారా లేదా గద్దె దిగుతారా అని తెలంగాణ సమాజం ప్రధాని మోదీకి సవాల్ విసిరింది.

కేసీఆర్ 1000 రోజుల్లో ఒక కోటి 24 లక్షల 40 వేల రూపాయలు జీతం తీసుకున్నారన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తారు. మరి కేసీఆర్‌ను ఏం చేయాలి. కేసీఆర్‌కు ప్రతిపక్ష నాయకుడి హోదా ఉన్నందుకు ఇన్నిరోజులు సెక్యూరిటీ, ఇల్లు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తదితర వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు ఖర్చు చేసింది. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా కోరుతూ ప్రజలు ఊరూరా ఆందోళనలు చేయాలి” అని సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# సీడ్ గణేశుడిని పూజించండి.. చిరంజీవి పిలుపు

మొదటిపేజీ తరువాయి

‘గ్రీన్ ఇండియా చాలెంజ్’ రూపొందించిన సీడ్ గణేశా ప్రతిమలను చిరంజీవి తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను ఓ యజ్ఞంలా భావించి ఇప్పటికే 20 కోట్ల మొక్కలు నాటేలా

# రాష్ట్రపతి వద్ద విధులు.. 12 ఏళ్లకే రిటైర్మెంట్: ఎవరీ మేజర్ రిషభ్..?






మొదటిపేజీ తరువాయి

రాష్ట్రపతి ‘ఎయిడ్-డి-క్యాంప్’ మేజర్ రిషభ్ సింగ్ సాంబ్యాల్ అంటే వెంటనే అందరూ గుర్తించకపోవచ్చు. కానీ ద్రౌపదీ ముర్ము అధికారిక కార్యక్రమాలు, పర్యటనల్లో ఆమె పక్కన కనిపించే ఆర్మీ అధికారి అనగానే వెంటనే గుర్తుపడతారు. సోషల్ మీడియాలో ఆయనకు ఉన్న క్రేజ్ అలాంటిది. తాజాగా ఆయన ముందస్తు పదవీ విరమణ చేయడం చర్చనీయాంశమైంది. 12 ఏళ్లపాటు సైన్యంలో పని చేసిన రిషభ్ .. వ్యక్తిగత కారణాలతో ఆర్మీని వీడినట్లు పేర్కొన్నారు.

**ఎన్‌డీఏ నుంచి రాష్ట్రపతి భవన్‌కు..**

32ఏళ్ల రిషభ్ 2014లో నేషనల్ డిఫెన్స్ అకాడమీ లో చేరారు. మిలిటరీ స్టడీస్, డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అభ్యసించారు. ‘4 పారా స్పెషల్ ఫోర్సెస్’లో పనిచేశారు. ఇందులో ప్రఖ్యాత ‘బలిదాన్ బ్యాడ్జ్’ను పొందారు. 2021 గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కెప్టెన్‌గా ‘జాట్ రెజిమెంట్’ దళానికి నాయకత్వం వహించారు. ఆ ఏడాది జాట్ రెజిమెంట్ ఉత్తమ మార్చింగ్ కంటింజెంట్ ట్రోఫీని గెలుచుకోవడంతో రిషభ్ సింగ్ పేరు మార్మోగింది. అనంతరం 2023లో ఆయన రాష్ట్రపతి ఏడీసీగా ఎంపికయ్యారు. అప్పటి నుంచి ఆయన కెరీర్ కీలక మలుపు తిరిగింది.

**అయోధ్య మందిరానికి రూ.4 కోట్ల చెక్కు.. ఖాతాలో రూ.3**

రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాల్లో తరచూ కన్పించడం, ప్రొటోకాల్‌కు అనుగుణంగా భద్రతా విధులను సమర్థంగా నిర్వర్తించడంతో ఆ మధ్య సామాజిక మాధ్యమాల్లో రిషభ్ వైరల్‌గా మారారు. నెటిజన్లు ఆయనకు ‘నేషనల్ క్రష్’ అనే ట్యాగ్‌ను కూడా ఇచ్చారు. ఇప్పుడు ఉన్నట్టుండి ఆయన పదవి నుంచి వైదొలగడం నెట్టింట చర్చకు దారితీసింది. రిషభ్ రిటైర్మెంట్‌పై రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి వివరణ రాలేదు. అయితే, వ్యక్తిగత, కుటుంబపరమైన బాధ్యతల కారణంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# సింధు జలాలపై తీర్పు.. కోర్టుకు ఆ పరిధిలేదన్న భారత్



సింధు జలాల ఒప్పందంపై ప్రపంచబ్యాంక్ ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ కోర్టు ఇచ్చిన తీర్పును భారత్ తోసిపుచ్చింది. ఈ న్యాయస్థానం చట్టవిరుద్ధంగా ఏర్పాటైనదిగా పేర్కొంది. సింధు జలాల ఒప్పందం తాత్కాలిక నిలుపుదల కొనసాగుతుందని స్పష్టంచేసింది. పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం సింధు జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా పక్కన పెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రపంచ బ్యాంక్ ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది.

ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడానికి న్యూదిల్లీ చెప్పిన కారణం సహేతుకంగా, రద్దుకు సమర్థనీయంగా లేదని పేర్కొంది. భారతదేశం ఒప్పందం పూర్తిస్థాయిలో అమలుకు కట్టుబడాలని పిలుపునిచ్చింది. అలాగే, జమ్మూకశ్మీర్‌లో నిర్మిస్తున్న హైడ్రోఎలక్ట్రిక్ పనులపై పరిమితులు విధించింది. దీనిపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించింది. ఈ మధ్యవర్తిత్వ న్యాయస్థానం చట్టవిరుద్ధంగా ఏర్పాటైందని, భారత్ సార్వభౌమ నిర్ణయాలపై తీర్పు చెప్పే అర్హత గానీ, అధికార పరిధి గానీ దానికి లేదని స్పష్టంచేసింది. ఈ కోర్టును మొదటి నుంచీ భారత్ గుర్తించలేదని, దాని విచారణలకు ఎప్పుడూ హాజరుకాలేదని తెలిపింది. కాబట్టి ఆ న్యాయస్థానం ఇచ్చే తీర్పులు ఏవీ చెల్లవని, భారత్ చేపట్టే ప్రాజెక్టులపై వాటి ప్రభావం ఉండదని తేల్చిచెప్పింది.

**ఏమిటీ ఒప్పందం?**

సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. దీనిపై 1960 సెప్టెంబరులో నాటి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం సింధు ఉప నదుల్లో తూర్పున ప్రవహించే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారతదేశానికి హక్కులు లభించాయి. సింధు నదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ మద్దతు ఇస్తోందనే కారణంతో 2025 ఏప్రిల్‌లో భారతదేశం ఈ ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఉగ్రవాదాన్ని శాశ్వతంగా అణచివేసే వరకు ఈ ఒప్పందం పునరుద్ధరణ ఉండదని భారత్ స్పష్టం చేసింది.

# టిష్యూపై ‘బాంబ్’.. ఎయిరిండియా విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

అహ్మదాబాద్: సౌదీ అరేబియా నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిరిండియా విమానం గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. ‘బాంబ్’ అని రాసి ఉన్న టిష్యూ పేపర్ లభించడంతో విమానాన్ని ఎమర్జెన్సీ ల్యాండ్ చేయాల్సి వచ్చిందని పోలీసులు తెలిపారు. ఆ సమయంలో విమానంలో 32 మంది ప్రయాణికులు ఉన్నారు.సౌదీ నుంచి ఢిల్లీ వస్తున్న విమానంలోని వాష్‌రూమ్‌లో సిబ్బందిలో ఒకరికి టిష్యూ దొరికింది. దానిపై ‘బాంబ్’




అని రాసి ఉండడంతో చూసి ముందు జాగ్రత్తగా, సెక్యూరిటీ ప్రోటోకాల్ ప్రకారం విమానాన్ని అప్పటికప్పుడు అహ్మదాబాద్ మళ్లించారు. సోమవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో విమానం ఇక్కడి అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యింది. ప్రయాణికులకు టెర్మినల్ 2లో ఆశ్రయం కల్పించారు. విమానాన్ని బాంబ్ స్క్వాడ్ పూర్తిగా తనిఖీ చేసి బాంబు ఆనవాళ్లు లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
మంగళవారం సెప్టెంబర్ 01, 2026
www.trinetnews.com

# క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయి: ఎమ్మెల్యే శ్రీగణేష్..

**అండర్-19 కళాశాలల 70వ క్రీడా పోటీలను ప్రారంభించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే..**
**చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని విద్యార్థులకు పిలుపు..**

**కంటోన్మెంట్, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31 :** క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జింఖానా మైదానంలో నిర్వహిస్తున్న అండర్–19 కళాశాలల 70వ క్రీడా పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ.. 16 నుంచి 19 ఏళ్ల వయసు యువతకు ఎంతో కీలకమని, ఈ దశలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలు ఏకాగ్రతను పెంచి





చదువులోనూ మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడా పోటీలు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగేందుకు గొప్ప వేదికగా నిలుస్తాయని అన్నారు. క్రీడా సర్టిఫికెట్లు ఉన్నత విద్య ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాకు ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి క్రీడా వసతుల అభివృద్ధికి చర్యలు చేపడుతోందన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ యువత, క్రీడాకారులకు అవసరమైన సహకారం అందించడంతో పాటు మైదానాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కళాశాలలకు, కంటోన్మెంట్ నియోజకవర్గానికి, హైదరాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# శిరీష మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి..

**ఓయూలో ఆదివాసీ విద్యార్థి ఫోరం కొవ్వొత్తుల ప్రదర్శన..**
**రూ.కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్.**
**నిందితుడు ఎండీ. సనావుల్లను ఎంకౌంటర్ చేయాలి...**

**తార్నాక, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31:** తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలానికి చెందిన ఆదివాసీ యువతి శిరీష మృతి ఘటనపై ఆదివాసీ విద్యార్థి ఫోరం నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. శిరీష మృతి ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నిష్పక్షపాతంగా, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్



చేశారు. ఘటనకు కారణమైన వారెవరైనా చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు. తీవ్ర విషాదంలో ఉన్న శిరీష కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు రూ.కోటి నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. శిరీష మృతికి కారణమని ఆరోపిస్తున్న బైక్ మెకానిక్ ఎండీ. సనావుల్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపడతామని ఫోరం నేతలు హెచ్చరించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, గతంలో ఇతర ఘటనల్లో జరిగిన పోలీసు ఎన్‌కౌంటర్లను ప్రస్తావించారు. సనావుల్లను ను తక్షణమే పోలీసులు ఎంకౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అప్పా నాగేశ్వరరావు, కొండ నాగేశ్వరరావు, బాలు నాయక్, ప్రొఫెసర్ కాశీమ్, ఆదివాసీ స్టూడెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మడావి అజయ్, గౌతమ్, శివగణేష్, రాజశేఖర్, బండి శేకర్, భావన, శిరీష, కె.వినోద్, అజయ్, సొందే అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఎంటీ నగర్ పెద్దచెరువు వద్ద దెబ్బతిన్న మ్యాన్ హోల్స్ కు మరమ్మత్తులు..

**ఇందిరానగర్‌లో డ్రైనేజీ రివర్స్ సమస్యకు పరిష్కారం చూపాలి..**
**అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన బీఆర్ఎస్ నాయకులు..**



**నాచారం, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31:** హెచ్ఎంటీ నగర్ పెద్దచెరువు ఇందిరానగర్ వైపు చెరువు కట్ట పక్కన ఉన్న ట్రంక్ లైన్ మ్యాన్ హోల్స్ దెబ్బతినడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా భారీ వాహనాల రాకపోకలతో పలు మ్యాన్‌హోల్స్ మూతలు ధ్వంసమయ్యాయి. కొన్ని పూర్తిగా కూలిపోవడంతో ఇందిరానగర్‌లో డ్రైనేజీ నీరు రివర్స్ వచ్చే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయి జెన్ శేఖర్ ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా దృష్టికి తీసుకెళ్లారు. దెబ్బతిన్న మ్యాన్ హోల్స్ ను పరిశీలించి, పేరుకుపోయిన పూడికను తొలగించడంతో పాటు నిర్మాణాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టి డ్రైనేజీ రివర్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. సమస్యపై స్పందించిన జోనల్ కమిషనర్ రాధిక గుప్తా వెంటనే జలమండలి ఈడీ పంకజతో మాట్లాడారు. మ్యాన్ హోల్స్ లోని పూడిక తొలగింపు, అవసరమైన మరమ్మతులను తక్షణమే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# శక్తి స్కీమ్ రద్దు చేయాలని పోస్ట్‌కార్డుల ఉద్యమం




**పాలటెక్నిక్ విద్యార్థులతో కలిపి పోస్ట్ కార్డులు పంపిన బీ=ూఎ నాయకులు..**

**సూర్యాపేట: ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31:** శక్తి స్కీమ్ (+.ూ. నం.97) ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి బిఆర్‌ఎస్వీ నాయకులు విద్యార్థులతో కలిసి పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా దీ=ూఎ నాయకులు బంటు సందీప్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్న శక్తి స్కీమ్ (+.ూ. నం.97)ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్ట్‌కార్డుల ద్వారా పాలిటెక్నిక్ విద్యార్థులతో పోస్ట్‌కార్డుల ఉద్యమం నిర్వహించమన్నారు. శక్తి స్కీమ్ వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శక్తి స్కీమ్ వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల అభిప్రాయాలను పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకు విద్యార్థుల తరఫున ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్వీ నాయకులు ఖమ్మంపాటి ఉదయ్, పడిదల నవనీత్, బొల్లం వినయ్, ఎలగబోయిన వంశీ, సాయి, వెంకట్, అభి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితులకు ఎల్ఓసీ నిధులు అందించిన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**



అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ఎర్రా రుషి, కంద స్వామిలకు వైద్య చికిత్స కోసం స్థానిక ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ ఆర్థిక సహాయం అందించారు.కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వారు సీతాఫలమండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్‌ను కలిసి తమకు వైద్య సహాయం అందించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించి కంద స్వామికి రూ.2.10 లక్షలు, ఎర్రా రుషికి రూ.2 లక్షలు వైద్య చికిత్స కోసం మంజూరు చేయించారు.సోమవారం సీతాఫలమండీలోని తన కార్యాలయంలో బాధితులకు ఎల్ఓసీ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ఏ అవసరం వచ్చినా తన కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య సేవలు అందేలా అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు డాక్టర్ సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# తుక్కుగూడలో నర్సుపై అత్యాచారం, హత్య ఘటనపై ప్రభుత్వం, పోలీసుల తీరు దుర్మార్గం: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ తీవ్ర ఆగ్రహం

**కేసును తొక్కిపెట్టేందుకు చూస్తే కోల్‌కతా 'ఆర్జీ కర్' ఘటన తరహాలోనే తీవ్ర పరిణామాలుంటాయి!**
**ఘటనపై పారదర్శకంగా దర్యాప్తు జరపాలి.. అవసరమైతే కేసును సీబీఐకి అప్పగించాలి**




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళల భద్రత గాలిలో దీపంలా మారిందని బీజేపీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న గిరిజన (ఎస్టీ) యువతిపై జరిగిన అత్యాచారం, హత్య అత్యంత పాశవికమని, ఇది సభ్యసమాజం తలదించుకునే ఘోరమైన ఘటన అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీవనోపాధి కోసం ఖమ్మం/కొత్తగూడెం ప్రాంతం నుంచి వచ్చిన ఓ యువతి స్థానిక ప్రైమ్ కేర్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ సమీపంలోని హాస్టల్‌లో ఉంటోందని తెలిపారు. పక్కనే ఉన్న మెకానిక్ షాపులో పనిచేసే సనావుల్లా ఖాన్ అనే వ్యక్తి దుర్మార్గంగా హాస్టల్ గదిలోకి చొరబడి ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడని, ఆమె ప్రతిఘటించడంతో అత్యంత కిరాతకంగా హత్య చేశాడని పేర్కొన్నారు. నిందితుడు పెట్రోల్ పోసి ఆధారాలు చెరిపివేసేందుకు సైతం ప్రయత్నించాడని సమాచారం వస్తోందని చెప్పారు.

సిసిటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడు స్పష్టంగా గుర్తించబడినప్పటికీ, పోలీసులు నిన్నటివరకు కేసు నమోదు చేయకుండా, అరెస్టును అధికారికంగా ధ్రువీకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు. మృతురాలి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి, నష్టపరిహారం పేరుతో నచ్చజెప్పి పోస్టుమార్టం హడావుడిగా ముగించి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ప్రయత్నించడం చూస్తుంటే, కేసును తొక్కిపెట్టే కుట్ర స్పష్టంగా కనిపిస్తోందని వీరేందర్ గౌడ్ ఆరోపించారు.

కోల్‌కతాలోని 'ఆర్జీ కర్' మెడికల్ కాలేజీ ఘటనలో మమతా బెనర్జీ ప్రభుత్వం నేరస్థులను కాపాడేందుకు ఏ విధంగా ప్రయత్నించిందో, తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే తరహాలో నిందితుడిని రక్షించే విధంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా ధ్వజమెత్తారు.

ఒకే వారంలో మహిళలు, మైనర్లపై వరుస అకృత్యాలు జరుగుతున్నా ప్రభుత్వం నిర్లిప్తంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కొద్దిరోజుల క్రితం ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ మైనర్ బాలికతో అసభ్య వీడియోల్లో పట్టుబడితే... కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కనీస ప్రకటన కూడా చేయలేకపోయాయని విమర్శించారు.

తుక్కుగూడ, మంఖాల్ ప్రాంతాలలో విచ్చలవిడిగా పుట్టుకొచ్చిన హాస్టళ్లు, డ్రగ్స్ వాడకం, సరైన వివరాలు లేని ఇతర ప్రాంతాల వారి వల్ల శాంతిభద్రతలు క్షీణించి స్థానిక మహిళలు, విద్యార్థినులు భయాందోళనలతో జీవించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కేసులో ప్రభుత్వం నిష్పాక్షికంగా, అత్యంత పారదర్శకంగా దర్యాప్తు జరిపి నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని బీజేపీ తరఫున ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసు యంత్రాంగంపై ప్రజలకు నమ్మకం కలిగించేలా దర్యాప్తు జరగకపోతే, ఈ కేసును తక్షణమే కేంద్ర దర్యాప్తు సంస్థ (జదీ×)కు అప్పగించాలని డిమాండ్ చేశారు.

# దివ్యాంగుల హక్కుల చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలి..

**ఓయూ రిజిస్ట్రార్‌ను కోరిన విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం..**




**తార్నాక, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31 :** దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం రూపొందించిన దివ్యాంగుల హక్కుల చట్టం–2016పై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. అశోక్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ను కలిసి, ఓయూ ఆర్ట్స్ కళాశాలలో చట్టంపై ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని కోరారు. దివ్యాంగుల హక్కులు, ఆత్మగౌరవం, సమాన అవకాశాలపై తగిన అవగాహన లేకపోవడంతో అనేక సందర్భాల్లో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతినిధులు తెలిపారు. సమాజంలో చట్టంపై పూర్తి స్థాయి అవగాహన కల్పించడం ద్వారా దివ్యాంగుల హక్కులను మరింత సమర్థంగా పరిరక్షించవచ్చన్నారు. ఫోరం విజ్ఞప్తిపై ఓయూ రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించి, చట్టం–2016పై అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఫోరం ప్రతినిధులు దివ్యాంగుల హక్కుల చట్టం–2016 పుస్తకాన్ని రిజిస్ట్రార్‌కు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఫోరం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్‌తో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

# డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ గణేష్ ఉత్సవ సమతి నూతన కన్వీనర్‌గా శ్రీ తాడూరి గగన్ కుమార్ ఏన్నిక.

**హైదారాబాద్, ట్రైన్ నైట్ న్యూస్,**




అగస్టు:31 : డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్ డివిజన్‌కు సంబంధించిన గణేష్ ఉత్సవ సమితి నూతన కన్వీనర్‌గా శ్రీ తాడూరి కిరణ్ కుమార్‌ను గణేష్ ఉత్సవ సమితి ఫౌండర్లు, మాజీ కన్వీనర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు ధార్మిక సంఘాల ప్రతినిధుల మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

ఈ విషయాన్ని అధికారికంగా తెలియజేయడం కోసం గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ఈరోజు కుషాయిగూడ పోలీస్ స్టేషన్ (అడ్మిన్ ఎస్ఐ సుధాకర్) మరి డివిజన్ ఎస్ఐ అధికారులను కలిసి సమాచారం అందించడం జరిగింది.

రాబోయే గణేష్ ఉత్సవ కార్యక్రమాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో మరియు సమన్వయంతో నిర్వహించేందుకు పోలీస్ శాఖ నుండి సహాయ సహకారాలు అందించాలని గణేష్ ఉత్సవ సమితి సభ్యులు కోరారు.

అలాగే డివిజన్‌లో గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అవసరమైన సమాచారం, సూచనలు మరియు సహకారాన్ని సమితికి తెలియజేయాలని పోలీస్ అధికారులను కోరడం జరిగింది. పాల్గొన్నవారు : బి. పుల్లారెడ్డి, కె. రమేష్ యాదవ్, నీరుకొండ సతీష్,తాడూరిగగన్ కుమార్, జి. ఆదినారాయణ చౌదరి, రామ్ సాగర్ కిషోర్ చారి,జి నరసింహ చారి, ఎస్. ఉమేష్, ఏ.మహేష్, పి.ప్రణయ్ పి.ప్రవీణ్ మొదలైన వారు పాల్గొన్నారు

ఇట్లు,
తాడూరి గగన్ కుమార్ గణేష్ ఉత్సవ సమితి
డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ కన్వీనర్

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి:

**ప్రజావాణి పోర్టల్‌లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లో నమోదు..**
**ప్రజావాణి కి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి**
**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్....**



**సూర్యాపేట, ట్రైనెట్ న్యూస్ , ఆగస్టు 31:**
ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబంధించి 36 దరఖాస్తులు, డి పి ఓ 7, మున్సిపాలిటీ 5 , డిఎంహెచ్వో 3, మిగిలిన 19 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 70 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, సిపిఓ కిషన్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎంహెచ్వో వెంకటరమణ, డిపిఓ యాదగిరి, డిడబ్ల్యూఓ నరసింహారావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# బిజెపి రాష్ట్ర కార్యాలయం ముట్టడికి యత్నం

**-కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని యూత్ కాంగ్రెస్ డిమాండ్**





**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31:**
ఏ ఐ సి సి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పై, బీహార్ లో విద్యార్థులపై బీజేపీ వ్యవహరించిన తీరును నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం అబిడ్స్ లోని బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఇటీవల ఒక దేవాలయంలోకి వెళ్లి వస్తే ఆ దేవాలయాన్ని బిజెపి పార్టీ నాయకులు శుద్ధి చేయడం పై మండిపడ్డారు. బీహార్ లో విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దళితుల పట్ల, విద్యార్థుల పట్ల బిజెపి వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. బిజెపి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న గేటుకు నల్ల రంగు పూసి కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు యూత్ కాంగ్రెస్ శ్రేణులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వెంటనే యూత్ కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర కో ఇంచార్జ్ లు రోషిని జైస్వాల్, భవ్య, శక్తి సూపర్ షి రాష్ట్ర సమన్వయకర్త విద్యా రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, తేజ, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

# 6న నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో “జిజ్ఞాస” నృత్య కార్యశాల

**హైదరాబాద్, చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్, ఆగస్ట్ 31:**
భారతీయ శాస్త్రీయ నృత్య రీతులలో విశిష్టతను తెలియజెప్పేందుకు, పరిశోధనా అంశాల ఎంపికపై, పత్ర రచనా పద్ధతి తదితర విషయాలపై అవగాహనను పెంపొందించేందుకు “జిజ్ఞాస” పేరిట ఒక నృత్య కార్యశాలను సెప్టెంబర్ 6, ఆదివారం నిర్వహించనున్నట్టు నవ్య నాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్తలు నిష్టల సుధామాల, మధుమతి కులకర్ణి పత్రికా విలేకరులకు సమితి కార్యాలయంలో తెలిపారు. శ్రీ కృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయంలో జరిగే ఈ కార్యశాలలో నాట్య ప్రక్రియలపై పరిశోధనా విధానంలో ప్రామాణిక వ్యాసరచనా పద్ధతిపై ప్రముఖ నృత్య గురువు, అమెరికాలోని అరియ



విశ్వవిద్యాలయం ఆచార్య వేలూరి సుమిత్ర సూచనలు చేస్తారని సుధామాల తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రిక ను సోమవారం నవ్య నాటక సమితి కార్యాలయం లో రాష్ట్ర ఖజానా లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర సమితి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వసుంధర మాట్లాడుతూ .. నృత్య రంగంలో ప్రామాణిక పత్ర రచన చేయాలనుకునే విశ్వ విద్యాలయ పరిశోధక విద్యార్థులకు, నృత్య కళాకారులకు ఈ కార్యశాల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. భారతీయ శాస్త్రీయ నృత్య, సంగీత రంగాలలో కార్యశాలలను, ఉపన్యాస కార్యక్రమాలను నిర్వహిస్తూ, కళాకారులను ప్రోత్సహిస్తున్న నవ్య నాటక సమితి కార్యనిర్వాహక సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు డా. ఇందిరా హేమ, వేమరాజు రమాదేవి పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఎంఎంసీ లోగో ఆవిష్కరణ..

**654 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 3 జోన్లు, 14 సర్కిళ్లు, 74 వార్డులతో కార్పొరేషన్..**
**ప్రజలకు మెరుగైన సేవలు, ఆధునిక మౌలిక వసతులే లక్ష్యంగా ముందుకు..**




MMC
MALKAJGIRI
MUNICIPAL CORPORATION

**అంబర్ పేట్, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31:**
నూతనంగా ఏర్పాటైన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) అధికారిక లోగోను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం అంబర్‌పేట్ స్టేడియంలో ఆవిష్కరించారు. కార్పొరేషన్ ప్రత్యేకత, పట్టణ అభివృద్ధి, ప్రజా సేవలు, భవిష్యత్ దిశను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ లోగో ఎంఎంసీకి అధికారిక ప్రతీకగా నిలవనుంది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పట్టణ పరిపాలనా పునర్వ్యవస్థీకరణలో భాగంగా 654 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటైంది. మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్‌బీ నగర్ జోన్లుగా విభజించి, 14 సర్కిళ్లు, 74 వార్డులతో కార్పొరేషన్ విస్తరించింది. 2026 ఫిబ్రవరిలో టి. వినయ్ కృష్ణా రెడ్డి, ఐఏఎస్‌ను కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేసింది. పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, పచ్చదనం, పట్టణ ప్రణాళిక, మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంపై ఎంఎంసీ అధికారులు దృష్టి సారిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యం, అధికారుల సమన్వయంతో ఆధునిక, పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన నగరంగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. సీఎం చేతుల మీదుగా లోగో ఆవిష్కరణ ఎంఎంసీ పరిపాలనా చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిందని పేర్కొన్నారు.

## చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువు పొడిగింపు

హైదరాబాద్: చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పెన్షన్ల కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోంది. రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఈ నెల 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులను ఆహ్వానించింది. నేటితో గడువు ముగియగా.. దరఖాస్తు చేయని వారు ఇంకా ఉండటంతో వారి అభ్యర్థన మేరకు గడువు పొడిగించింది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు.

## జలవనరుల జియోట్యాగింగ్ ద్వారా పారదర్శకత: ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్: కేంద్ర జల్‌శక్తి శాఖ సెప్టెంబర్ 1 నుంచి దిల్లీలో నిర్వహించనున్న సదస్సులో తెలంగాణ సమగ్ర జలభద్రత నమునాను వివరించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా సుస్థిర జలవనరుల నిర్వహణకు సమన్వయంతో కూడిన కార్యాచరణ రూపొందించే లక్ష్యంతో దిల్లీలోని భారత్ మండపంలో మంగళ, బుధవారాల్లో జాతీయ సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. సదస్సులో రాష్ట్రం తరఫున సమర్పించనున్న ప్రజంటేషన్‌లో పొందుపరచాల్సిన అంశాలు, రాష్ట్రంలో అమలవుతున్న జలసంరక్షణ కార్యక్రమాలు, గొలుసుకట్టు చెరువుల పరిరక్షణ, జలవనరుల జియోట్యాగింగ్, భూగర్భజలాల పర్యవేక్షణతో పాటు దేశవ్యాప్తంగా అనుసరించదగిన సమగ్ర జలభద్రత విధానంపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. దేశ జలభద్రతకు సంబంధించిన కీలక సవాళ్లపై కేంద్రం, రాష్ట్రాలు ఒకే వేదికపై చర్చించి భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేయనున్న నేపథ్యంలో ఈ సదస్సుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని మంత్రి పేర్కొన్నారు. జలవనరుల సంరక్షణ నుంచి ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరా వరకు వివిధ అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం సాధించేందుకు.. నిర్దిష్ట కాలపరిమితితో కూడిన జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని తెలిపారు. ఇదే వేదికగా తెలంగాణ సమగ్ర జలభద్రత నమూనాను వివరిస్తామని పేర్కొన్నారు. జలవనరుల జియోట్యాగింగ్ ద్వారా పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం కల్పించినట్లు వివరించారు. నిధుల వినియోగం, పనుల పురోగతిని పర్యవేక్షించడంతో పాటు భూగర్భజలాల పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. 28వేల చెరువుల మ్యాపింగ్‌తో 25 లక్షల 70 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 9.70 టీఎంసీల నిల్వ సామర్థ్యం పునరుద్ధరణ చేసినట్లు తెలిపారు. గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ పరిరక్షణకు దీర్ఘకాలిక ప్రణాళిక అమలు చేయనున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.

# “సేవారత్న” అవార్డు అందుకున్న మారమోని శ్రీశైలం యాదవ్




**హైదరాబాద్, చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్, ఆగస్ట్ 31 :**
సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తూ.. ప్రజలకు అండగా నిలుస్తున్న మారమోని శ్రీశైలం యాదవ్ సేవా కార్యక్రమాలకు మరో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. ఇటీవల “స్వర సప్త సంగీత వాద్య నృత్య సమ్మేళనం” కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ “సేవారత్న అవార్డు”తో ఘనంగా సత్కరించారు. గత కొంతకాలంగా శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా రక్తదాన శిబిరాలు , అన్న ప్రసాద వితరణ, విద్యార్థులకు విద్యా ఫీజుల సహాయం, వైద్య చికిత్సకు ఆర్థిక సహకారం, ఆసుపత్రుల్లో అవసరమైన వారికి మెడికల్ సహాయం, అనాథా, వృద్ధాశ్రమాల్లో ఆహార పంపిణీ, నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. అవసరమైన సమయంలో బాధిత కుటుంబాలకు తనవంతు సహాయాన్ని అందిస్తూ సేవా స్ఫూర్తిని చాటుతున్నారు.
ఈ సందర్భంగా శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ.. “సేవ చేయడం ద్వారా లభించే ఆత్మసంతృప్తి ఎంతో విలువైనదన్నారు . సమాజంలో అవసరంలో ఉన్న ఒక్క వ్యక్తికి అయినా సహాయం చేయగలిగితే అదే నాకు నిజమైన ఆనందం. ఈ అవార్డు నా సేవా బాధ్యతను మరింత పెంచిందని భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. శ్రీశైలం యాదవ్ సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలు, మిత్రులు, సేవా కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## న్యూ క్లబ్ అధ్యక్షుడిగా నోముల ప్రకాష్ రావు



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ ఆగస్టు 31:**
సికింద్రాబాద్ లోని న్యూ క్లబ్ అధ్యక్షుడు నోముల ప్రకాష్ రావు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం క్లబ్ అసోసియేషన్ కు జరిగిన ఎన్నికలలో నోముల ప్రకాష్ రావు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో సోమవారం ఆయన వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈ సందర్భంగా నోముల ప్రకాష్ రావుకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో ప్రకాష్ గుప్త, నార్ల దీపక్ గుప్త ఉన్నారు.

## తార్నాక డివిజన్‌లో అధ్వానంగా మారిన అంతర్గత రోడ్లు

**రోడ్ల దుస్థితి పై మాజీ కార్పొరేటర్ అలకుంట సరస్వతిహరి ఆవేదన**



**హైదరాబాద్, ఆగస్టు 31:**
తార్నాక డివిజన్‌లోని పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ కార్పొరేటర్ అలకుంట సరస్వతిహరి ఆవేదన వ్యక్తం చేశారు. తార్నాక డివిజన్‌లోని నాగార్జున నగర్ నుంచి అండాలు స్వీట్స్ మీదుగా నాచారం వెళ్లే మార్గాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో నిత్యం ప్రమాదాల భయం నెలకొంటోందని, పాదచారులు సైతం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో డివిజన్‌కు ప్రాతినిధ్యం వహించిన పాలకుల నిర్లక్ష్యం కారణంగానే అంతర్గత రోడ్లు ఈ దుస్థితికి చేరుకున్నాయని ఆమె ఆరోపించారు. ప్రజలకు అత్యవసరమైన మౌలిక వసతులపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. నాగార్జున నగర్‌తో పాటు తార్నాక డివిజన్‌లోని అన్ని కాలనీల్లో అధ్వానంగా ఉన్న రోడ్లను జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో కొత్త రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు అధికారులు ఇకనైనా స్పందించి రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అలకుంట సరస్వతిహరి కోరారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
మంగళవారం సెప్టెంబర్ 01, 2026
www.trinetnews.com

# ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి.

**నడిగూడెం ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**
:నడిగూడెం మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుత రోజులలో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని నడిగూడెం మండలం తహసీల్దార్ లావూరి మంగ కోరారు. సోమవారం నడిగూడెంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. గత 60 ఏళ్లుగా చేస్తున్న రసాయనిక వ్యవసాయంతో భూసారం పూర్తిగా దెబ్బతిన్నదని, మళ్లీ భూసారం పెరగాలంటే ప్రకృతి చేయాలన్నారు. తమ కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం రైతులు తమకున్న వ్యవసాయ భూమిలో కనీసం ఒక అర ఎక రంలో లేదా ఒక పెద్ద మడిలో ప్రకృతి వ్యవసాయంచేయాలన్నారు వ్యవసాయ భూమి లేని వారు తమ ఇళ్లల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాలలో కూరగాయలను సాగు చేసుకోవాలన్నారు. భూసారం పెరగాలంటే పశువుల పెంట, జీవామృతం పచ్చిరొట్ట ఎరువులను వాడాలన్నారు. అలాగే చీడపీడల నివారణ కోసం మనకు అందుబాటులో



లభించే ఆవు మూత్రం ఆవు పేడ ద్రావణం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, వావిలాకు కషాయం, లొట్ట పీస్ ఆకు కషాయం తదితర ద్రావణాలను తయారు చేసుకొని పిచికారి చేయాలన్నారు. దీంతో చీడ పీడలు సమర్థవంతంగా నివారించబడతాయన్నారు.

ఈ కార్యక్రమంలోఎం పి డి ఓ మల్సూర్, నడిగూడెం సర్పంచ్ దున్న శ్రీనివాస్ మాట్లాడుతూ సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు గత నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయం పై చేస్తున్న రైతు చైతన్య కార్యక్రమాన్ని అభినందించారు. నడిగూడెం కు చెందిన రైతులు ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంచేయాలన్నారు. గ్రామంలో స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్ల కార్డులతో ప్రదర్శనతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం మనందరి బాధ్యత, నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యం, పంట ఆరోగ్యమే మన ఆరోగ్యం, సేవ్ సాయిల్, లాంటి పలు నినాదాలతో నిర్వహించిన ర్యాలీ గ్రామస్తులను, రైతులను ఆకట్టుకున్నది. అనంతరం బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తామని, వ్యవసాయ భూమి లేకుంటే ఇళ్లల్లో కూరగాయలు పెంచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లావూరి మల్సూర్, మండల వ్యవసాయ అధికారి గోలి మల్సూర్, నడిగూడెం సర్పంచ్ దున్న శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు లావణ్య, రెమిడాల దుర్గ ప్రసాద్, శ్రీనివాసరావు, ఆదర్శ రైతు కన్నెబోయిన రామారావు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు హైమావతి, భాగ్యలక్ష్మి, సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మొలుగూరి గోపయ్య (గోపి )విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా రైతుల సుస్థిరాభివృద్ధికి వెదురు పెంపకం లాభదాయకం

**రంపచోడవరం ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**
రంపచోడవరం నియోజకవర్గం డి ఆర్ డి ఏ ఎస్ ఇ ఆర్ పి ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళా రైతుల సుస్థిర అభివృద్ధి కి వెదురు మొక్కలు పెంపకం లాభదాయకము అని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి తెలియజేశారు రంప చోడవరం మండల సమాఖ్య వెలుగు కార్యాలయంలో సోమవారం డి ఆర్ డి ఏ పథక సంచాలకులు దాసరి రత్నాకర్ ఆధ్వర్యంలో ఎస్ హెచ్ జి మహిళా రైతు సభ్యులకు వెదురు మొక్కలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికిరంపచోడవరం నియోజవర్గ ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి ముఖ్యఅతిథిగా విచ్చేశారు .ఆమెకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మండల మహిళా సమాఖ్య సిబ్బంది సాదర స్వాగతం పలికారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాని కి ఎలాంటి విఘాతం లేకుండా గిరిజన ప్రాంతాల్లో జిల్లా వ్యాప్తంగా 10 వేలమంది రైతులకు గానూ 6 లక్షల వెదురు మొక్కలు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేవలం సుమారు 37 సెంట్ల లో 60 మొక్కలు నాటే అవకాశం ఉందన్నారు. దీని ద్వారా మొదటి 5 సంవత్సరాల్లో 40 వేల రూపాయలు నుండి ఒక లక్ష






రూపాయలు ఆదాయం సమకూరుతుంది అని దీనిలో భాగంగా ఇప్పటికే 10వేల మంది లక్ష్యమని కాగా 7484 మందికి ఇప్పటికే వెదురు మొక్కలు పంపిణీ కోసం రిజిస్టర్ చేసినట్లు పేర్కొన్నారు.

ఈ పథకాన్ని స్వయం సహాయక సంఘాల మహిళా రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే సిబ్బంది మొక్కలు పెంపకానికి కావలసిన అన్ని రకాల సూచనలు దగ్గరుండి పర్యవేక్షణ చేసి మహిళా రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తారని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే శిరీష దేవి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సంయుక్త కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ ల చేతుల మీదుగా లబ్ధిదారులకు వెదురు మొక్కలు పంపిణీ చేశారు. ఆయా మొక్కలు సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం క్షుణ్ణంగా వివరించారు. ఇప్పటికే చాలా చోట్ల బీడుగా ఉన్న భూముల్లో దీనిని సాగు చేయడం ద్వారా మంచి ప్రయోజనాలుకలుగుతాయి అన్నారు ఒకసారి దీనిని నాటితే ఎక్కువ ప్రయోజనాలు దక్కుతాయి అన్నారుఈ కార్యక్రమంలో కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ కొత్తమాసు దినేష్ కుమార్ సంయుక్త కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్లె సునీత, మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, జెడ్ పి టి సి పండా వెంకటలక్ష్మి, డి ఆర్ డి ఏ పథక సంచాలకులు దాసరి రత్నాకర్ సంబంధిత అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు

# చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువు పెంచాలి

**బీజేపీ మండల అధ్యక్షులు పారెల్లి మహేష్.**

**చిలుకూరు ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**
చిలుకూరు:చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం వెంటనే పెంచాలని బీజేపీ చిలుకూరు మండల పార్టీ అధ్యక్షులు పారెల్లి మహేష్ డిమాండ్ చేశారు. లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులు కూడా సర్వర్ సమస్యల కారణంగా పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ కాలేదని ఆయన పేర్కొన్నారు.పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులకు వృద్ధాప్య పింఛన్దరఖాస్తుల స్వీకరణను ప్రభుత్వం చేపట్టకపోవడంబాధాకరమన్నారు. అరకొరదరఖాస్తులు స్వీకరించి కాలం వెళ్లదీయకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ



అవకాశం కల్పించేలా దరఖాస్తుల గడువును పొడిగించాలని కోరారు.చేయూత పింఛన్ దరఖాస్తులతో పాటు వృద్ధాప్య పింఛన్, మహాలక్ష్మి పథకం దరఖాస్తులను కూడా ప్రభుత్వం స్వీకరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దివ్యాంగులకు రూ.6,000, చేయూత పింఛన్ లబ్ధిదారులకు రూ.4,000 పింఛన్ అందించే హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా పారదర్శకంగా దరఖాస్తుల స్వీకరణ చేపట్టాలని, సర్వర్ సమస్యలను వెంటనే పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని పారెల్లి మహేష్ డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు మోదుగు శ్రీనివాసరెడ్డి, కట్టెకోల వెంకటమ్మ, బత్తిని శ్రీనివాస్, కోడారు సుదర్శన్, మోదుగు కృష్ణారెడ్డి, రణబోతు వెంకటరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు తిప్పిరిశెట్టి బసవయ్య, ప్రధాన కార్యదర్శులు రామినేని నరసింహ వర్మ, కొండా శీను, నాగచారి, ముక్క ఎల్లయ్య, బుడిగ వీరబాబు, మీసాల మట్టయ్య, బుడిగ సురేష్ తదితరులు, పలు గ్రామాల పార్టీ బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయురాలు కస్తూరి రజినీదేవికి ఘన సన్మానం

**భీమదేవరపల్లి, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**
హనుమకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలంలోని మాణిక్యపూర్ బీసీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి కస్తూరి రజినీదేవి పదవీ విరమణ సందర్భంగా అభినందన సభ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగంలో ఆమె అందించిన సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ అనంతరం ఆమె ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలనిఆకాంక్షించారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు

**తొర్రూరు, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**
జర్నలిస్టు, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు (ఐజేయూ) దూలం శ్రీనివాస్ గౌడ్ కుమార్తె వివాహ వేడుకకు తొర్రూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కన్న మహబూబ్ రెడ్డి, కిష్టాపురం సర్పంచ్ నకిరేకంటి మాధవి సంపత్, వెన్నం సోమిరెడ్డి, మహంకాళి సంపత్, యర్రం రాజు యాదవ్, వేల్పుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం.. సమస్య ఎక్కడ ఉంటే సేవాలాల్ సేన అక్కడే

**భూక్య బాలు నాయక్**



**చిలుకూరు ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**
చిలుకూరు. బాలాజీనగర్: సమస్య ఎక్కడ ఉంటే అక్కడ సేవాలాల్ సేన ఉంటుందని తెలంగాణ రాష్ట్ర సేవాలాల్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య బాలు నాయక్ అన్నారు. కోదాడ పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న బాలుర వసతిగృహాన్ని ఆయన స్థానిక కౌన్సిలర్ చైతన్య నాయక్తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
బాలాజీనగర్‌లో ఉన్న వసతిగృహాన్ని లక్ష్మీపురానికి తరలించడంతో కె.ఆర్.ఆర్ ప్రభుత్వ కళాశాలకు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు బాలు నాయక్ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల సమస్యను తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి హాస్టల్‌కు వెళ్లి సమస్యపై చర్చించారు.
ఈ సమస్యను స్థానిక కౌన్సిలర్ చైతన్య నాయక్ సమక్షంలో త్వరలో కోదాడ ఎమ్మెల్యేను కలిసివివరించి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని సేవాలాల్ సేన తరఫున భూక్య బాలు నాయక్ హామీ ఇచ్చారు.
విద్యార్థుల విద్యాభ్యాసానికి ఇబ్బంది కలిగించే సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ సీనియర్ నాయకుడు బర్మావత్ నరేందర్ నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు ధరావత్ కోటేష్ నాయక్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో ప్రజా సమస్యలకు పరిష్కారం

**నోడల్ అధికారి:జి. జలంధర్ రెడ్డి**



**యాదాద్రి భువనగిరి జిల్లా: ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**
వలిగొండ: మండల కేంద్రంలో సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రజల సమస్యలు, ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. మొత్తం 21 వివిధ శాఖలకు చెందిన అధికారులు/సిబ్బంది పాల్గొని ప్రజల సమస్యలనుతెలుసుకున్నారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 6 దరఖాస్తులు స్వీకరించగా, అందులో ఒక దరఖాస్తు విద్యుత్ షాక్ కారణంగా గేదెలు/గేదెలకు జరిగిన నష్టానికి సంబంధించినదిగా,వాటికి సంబంధించిన బీమా పరిహారం (ఇన్సూరెన్స్ క్లెయిమ్) మంజూరు చేయించాలని కోరుతూ సమర్పించబడింది.
ఈ సందర్భంగా నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి మాట్లాడుతూప్రజలకు సేవ చేయడానికే మేము ఇక్కడ ఉన్నాము. ప్రజలు తమ సమస్యలను,ఇబ్బందులను నిరభ్యంతరంగా మా దృష్టికి తీసుకురావాలి. సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యలనుపరిష్కరించేందుకు కృషి చేస్తాము" అని తెలిపారు.

## రిపోర్టర్ వలిని పరామర్శించిన టీ జె ఏ జిల్లా అధ్యక్షుడు షానూర్



**యాదాద్రి భువనగిరి జిల్లా :ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**
వలిగొండ :మండలానికి చెందిన సూర్య దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ నాగేల్లి వలి తండ్రి నాగేల్లి రాములు ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్తులైనారు.విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించిన
తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, మీడియా అక్రిడెషన్ కమిటీ సభ్యులు మొహమ్మద్ షానూర్ బాబా.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చినప్పుడు ప్రభుత్వము కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి జర్నలిస్టు కుటుంబాలనుఆదుకోవాలని కోరారు.వారితోపాటు టీ జె ఏ ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న,జిల్లా కార్యదర్శి యానాల సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన ఎంఈఓ సునీత విజయకుమార్‌కు ఘన సన్మానం



**భీమదేవరపల్లి, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**
భీమదేవరపల్లి మండల ఎంఈఓగా పదవీ విరమణ పొందిన మారపల్లి సునీత విజయకుమార్ పత్రాని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..మండలంలోని వివిధ పాఠశాలలను నిరంతరం సందర్శిస్తూ విద్యార్థుల సంఖ్య పెంపు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు సునీత విజయకుమార్ విశేషంగా కృషి చేశారనికొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ విద్యకుప్రాధాన్యతనిచ్చారని తెలిపారు.విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, ఐఏఎస్, ఐపీఎస్ తదితర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులు, గురువులు, పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఎల్లప్పుడూప్రోత్సహించేవారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, రాష్ట్ర నాయకులు బొక్క కుమార్, తొందూరి ఎల్లయ్య, కండె సుధాకర్, ఇంద్రానగర్ సర్పంచ్ అంబాల రాజకుమార్, కడారి రఘువరన్, మేకల సిద్ధార్థ్, చరణ్, బొల్లంపల్లి ప్రకాష్, మాడుగుల మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ న్యాయవాది చల్లా కోటయ్యకు ఘన సన్మానం

**నడిగూడెం ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**
:నడిగూడెం మండల పరిధిలోని వల్లపురం గ్రామంలో వెలసిన బాల కోటేశ్వర స్వామి దేవాలయంలో ప్రముఖ న్యాయవాది, స్వేచ్ఛ ఎన్జీవో ఫౌండర్ చల్లా కోటయ్యను ఆలయ కమిటీఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ పల్లామోహన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరెడ్డి, సెక్రటరీ రాజశేఖర్, ఆలయ పూజారి ప్రసాద్ శర్మ, నరేష్‌తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లా కోటయ్య సేవలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

మంగళవారం సెప్టెంబర్ 01, 2026

www.trinetnews.com

# ఫ్యూచర్ సిటీలో కలిపే వరకు పోరాటం ఉధృతం చేస్తాం

- ఫ్యూచర్ సిటీలో కలపకుండా అడ్డు పడుతున్న వారిని ప్రజలే అడ్డుకుంటారు
- ఫ్యూచర్ సిటీలో కలపడంపై పెరుగుతున్న మద్దతు
- మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో పూర్తిగా విలీనం చేయాలి
- 2 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు ప్రారంభం
- ఫ్యూచర్ సిటీ జేఏసీ అధ్యక్షుడు వి. రఘుపతి
- గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్

**మహేశ్వరం, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**

భారత్ ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలాన్ని పూర్తిగా విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ ఆధ్వర్యంలో రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో జేఏసీ నాయకులు దీక్షకు కూర్చున్నారు. మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని కోరుతూ గత ఏడాది కాలంగా జేఏసీ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ధర్నాలు, రాస్తారోకోలు, బైక్ ర్యాలీలు,



సభలు, సమావేశాలు నిర్వహించడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో ఆందోళనను మరింత ఉధృతం చేస్తూ రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు. ఈ దీక్షలకు కుల, మత, పార్టీలకు అతీతంగా వివిధ వర్గాల నుంచి మద్దతు లభించింది. ఫ్యూచర్ సిటీ జేఏసీ అధ్యక్షుడు వి. రఘుపతి, గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కడారి జంగయ్య యాదవ్, పోతల దర్శన్ యాదవ్, సీపీఐ రాష్ట్ర నాయకులు దత్తు నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వి. మల్లేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాండు నాయక్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్, మన్సాన్‌పల్లి గ్రామ ఉపసర్పంచ్ వి. నరసింహ యాదవ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈశ్వర్ నాయక్, బీజేపీ నాయకులు అల్లంపల్లి మల్లేష్, రమేష్, పి. సాంబయ్య యాదవ్, ఐ. నరసింహ గౌడ్, సర్దార్‌నగర్‌కు చెందిన బీజేపీ నాయకులు స్వామి గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

## డిమాండ్ నెరవేరే వరకు పోరాటం

ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వి. రఘుపతి మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీకి మహేశ్వరం మండలం అత్యంత సమీపంలో ఉన్నప్పటికీ దాన్ని విలీనం చేయకపోవడం వల్ల ఈ ప్రాంత రైతులు, యువత భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో



మహేశ్వరాన్ని విస్మరించడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలు సమావేశాలు నిర్వహించి మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలనే తీర్మానాలు చేసి, వాటిని జేఏసీ కమిటీ సభ్యులతో పాటు ప్రభుత్వ అధికారులకు అందజేయాలని కోరారు. తీర్మానాలు ఇవ్వని పక్షంలో స్వచ్ఛందంగా మహేశ్వరం బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. తమ డిమాండ్ నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేసిన చిలకమర్రి నర్సింహ

అనంతరం సోమవారం సాయంత్రం మాజీ ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ చిలకమర్రి నర్సింహ దీక్షా శిబిరానికి చేరుకుని జేఏసీ కమిటీ సభ్యులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన జేఏసీ నాయకుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ ఇంద్రకంటి నరసింహ గౌడ్, ఇంద్రకంటి వెంకటేష్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్టి మల్లేష్, మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిట్టి గణేష్, తడకల శీను, జి. శీను తదితరులు దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

# శిరీష పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు తాటి మరియు మెచ్చా





**ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31 ఉమ్మడి ఖమ్మం జిల్లా.**

ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఊకె శిరీష హైదరాబాద్‌లోని ప్రేమ్ కేర్ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ మానభంగానికి గురై, తీవ్ర గాయాలతో మృతి చెందారు. శిరీష పార్థివదేహాన్ని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యేలు, తాటి. వెంకటేశ్వర్లు
మెచ్చా నాగేశ్వర రావులు సందర్శించి శిరీష పార్థివ దేహానికి
పూలమాలవేసి ఘననివాళులు సమర్పించారు.
ఈ సందర్భంగా శిరీష కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. శిరీషపై మానభంగానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సన్నద్ ఉల్లా ఖాన్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ శాసనసభ్యులుతాటి. వెంకటేశ్వర్లు, మెచ్చా. నాగేశ్వరరావు లు డిమాండ్ చేశారు. రాష్ట్రబిజెపి నేత కుంజ ధర్మా సైతం శిరీష మృతదేహం వద్దకు వెళ్లి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.
శిరీష ను హత్య గావించడంపట్ల తీవ్రంగా ఖండించిన బిఆర్ఎస్, బిజెపి నేతలు అత్యంత దారుణమైన ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని
బాధిత కుటుంబా నికి ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం చేయాలని వారి కుటుంబంలోని వారికి ప్రభుత్వ ఉద్యోగం కేటాయించాలని రెండు పార్టీల నేతలు ప్రభుత్వాన్ని కోరారు.
ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పైడి. వెంకటేశ్వరరావు, బిఆర్ఎస్, బి జె పి పార్టీల నేతలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టే విధంగా ప్రణాళికలు సిద్ధం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**

కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో సోమవారం నాడు మీడియా సమావేశం నిర్వహించారు.. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి దగ్గరగా మూడు సంవత్సరాలు కాలం గడుస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేరలేదని.. ఈ సందర్భంగా 2వ తేదీ నుంచి ఇంటింటికీ బిఆర్ఎస్ పార్టీ నాయకులు తిరుగుతూ కాంగ్రెస్ బాకీ కార్డు పంపాలని.. అధికారం వస్తే వంద రోజుల్లో ఇస్తామన్న హామీలు వెయ్యి రోజులైనా కూడా తీర్చలేదని ఈ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశామని.. ఈ సందర్భంగా తెలిపారు.. కళ్యాణ్ లక్ష్మీ షాదీ ముబారక్ తోడు తులం బంగారం ఇస్తామని, 4000 పింఛన్ ,దళిత బంధు పథకం డబుల్ బెడ్ రూమ్ ఇలా 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనతో ముందుకు వెళుతుందని ఇక బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ప్రజాక్షేత్రంలో తేల్చుకునే సమయం ఆసన్నమైందని సందర్భంగా ఆయన తెలిపారు.. గత బిఆర్ఎస్ కాలంలో కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్రాన్ని



దేశాన్ని కే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దితే ఇప్పుడు రాష్ట్రాన్ని అధపా తాళానికి తీసుకెళ్లిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని ఎద్దేవా చేశారు.. ఇప్పటికే ప్రజలు విసిగి పోయారని కెసిఆర్ మళ్ళీ తిరిగి రావాలని కోరుకుంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాలు హామీలు నెరవేర్చే వరకు ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.. కనీసం ఎమ్మెల్యేలకు కూడా గౌరవం ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారి హిస్టారీ తన ప్రవర్తిస్తుందని. ఇకనైనా ప్రజా వ్యతిరేక నిర్ణయాలు మాని ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవాలని లేని ఎడల ప్రజలే బుద్ధి చెప్పే గుణపాఠం దగ్గర్లోనే ఉందని అన్నారు.

# విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలి,

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

**ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి.చందయ్య తో కలిసి కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, సి. ఆర్.పి. లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, తల్లితండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థలపై నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలలలో చేరుస్తున్నారని తెలిపారు. జిల్లాలో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతి రోజు అల్పాహారం అందించడంతో ప్రభుత్వ పాఠశాలలలో హాజరు శాతం తప్పకుండా పెరుగుతుందని తెలిపారు. పిల్లలు అభ్యాసన సామర్థ్యం పెంచే బాధ్యత విద్యాధికారులు,



ఉపాధ్యాయులదే అని, త్వరలో జిల్లాలో విద్యార్థుల హాజరు, నేర్చుకునే సామర్థ్యం తదితర అంశాలతో యాప్ ఏర్పాటు చేసి వారాంతపు నివేదికలు సేకరించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మల్టీ గ్రేడ్/ మల్టీ లెవెల్ టీచింగ్ అమలు చేయాలని,మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తరచూ పాఠశాలను సందర్శించి విద్యార్థుల పోటీతత్వం ఆధారంగా, తరగతుల విభజన, సీటింగ్ పొజిషన్ సక్రమంగా చేయాలని తెలిపారు. పాఠశాల సందర్శన సమయంలో విద్యార్థులతో మాట్లాడాలని, సంబంధిత ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని, సరైన టీచింగ్- లర్నింగ్ మెటీరియల్ ద్వారా ఎఫ్.ఎల్.ఎన్. శాతాన్ని పెంపొందించాలని



తెలిపారు. విద్యార్థులను నిశితంగా పరిశీలించడం, ఉపాధ్యాయులతో విద్యార్థులు సామర్థ్యాల గురించి సమీక్షించడం, తరగతుల ప్రణాళిక పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. సంబంధిత కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ పై అవగాహన కలిగి ఉండాలని, పాఠశాలలను తరచూ సందర్శించాలని తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే తెలియజేయాలని, అవసరం మేరకు వసతులు కల్పించడం జరుగుతుందని, విద్యార్థుల పఠన శక్తిని వృద్ధి చేసి నేర్చుకునే సామర్థ్యం పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సప్తగిరి కాలనీ శ్రీ మహాకాళేశ్వర ఆలయంలో వైభవంగా శివలింగ పూజ

**ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**

నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ మహాకాళేశ్వర స్వామివారి ఆలయంలో శివలింగ పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి విచ్చేసిన మైనంపల్లి హనుమంతరావుకు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, బి-



బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నాయకులు బీ.కే. శ్రీనివాస్, ప్రసాద్, రాఘవన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయ కమిటీ చైర్మన్ నయనపల్లి కనకయ్యతో పాటు కమిటీ సభ్యులు పుట్ట శ్రీనివాస్, కైతి నర్సింగ్, గంగాధర్, గుంటి కృష్ణ, కలకుంట్ల రాములు, పాము వీరేష్, రమణమోని కొండయ్య, కలకుంట్ల శ్రీనాథ్, కలకుంట్ల నవీన్, చింతల శ్రీకాంత్, మహేష్, రాయుడు, ఇందిర ప్రియదర్శిని, ప్రభా, యాదగిరి మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గ్రామ స్థాయిలోనే విలేజ్ రెవిన్యూ వ్యవస్థ ఏర్పాటు చేయాలి..

**ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**

ఒంటరి మహిళలు, వృద్ధుల పింఛన్ దారులు అన్ని ఇన్ని కావు గ్రామ స్థాయిలోనే విలేజ్ రెవిన్యూ వ్యవస్థ ఏర్పాటు చేయాలి, పింఛన్ దరఖాస్తు ఇంకో నెల పెంచాలి

--- సామాజిక కార్యకర్త తుడుం శ్రీనివాస్ విజ్ఞప్తి



కీసర: ప్రభుత్వం అందించే చేయూత పింఛన్ పథకం కింద ఒంటరి మహిళలు, వృద్ధాప్య పింఛన్ దారులు దరఖాస్తు చేసుకోవడానికి కావాల్సిన కులం-- ఆదాయం సర్టిఫికెట్లు, ఇతర ధృవీకరణ పత్రాల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, ఈ ఇబ్బందులను తొలగించేందుకు గ్రామ స్థాయిలోనే విలేజ్ రెవిన్యూ ఆఫీసర్ (విఆర్ఓ) వ్యవస్థను బలోపేతం చేయాలని సామాజిక కార్యకర్త తుడుం శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. కీసర సర్కిల్--1 డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో పింఛన్ అర్హులను గుర్తించేందుకు ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసి, గ్రామాల వద్దనే పత్రాలు సిద్ధం చేయించే విధంగా ప్రభుత్వం స్పెషల్ జీవో తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుత సమస్యలు ఇవేఒంటరి మహిళలు, వృద్ధులు ఏ ఆఫీసుకు వెళ్లాలి, ఏ పత్రాలు అవసరం అనేది అర్థం కాక అధికార కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వృద్ధాప్యం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు పలుమార్లు ప్రయాస పడి సర్టిఫికెట్లు తీసుకోవాల్సి వస్తోంది. పింఛన్ దరఖాస్తు ప్రక్రియలో అనవసరమైన ఆలస్యం, ఒత్తిడి ఎదుర్కొంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి,

**ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**

జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 31, 2026: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే



విధంగా చర్యలు తీసుకుంటామని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో అధికారులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని లక్షెట్టిపేట పట్టణానికి చెందిన మోటూరి శ్రీనివాస్ లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం మేదరిపేట గ్రామానికి చెందిన సిద్ధి మల్లేష్ తమకు చెందిన భూమి ఇతరుల పేరిట అక్రమంగా పట్టా మార్పు జరిగిందని, ఇట్టి పట్టా రద్దు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణంలోని గర్మిళ్ళకు చెందిన ఆవుల వెంకటేశం తనకు గ్రామ శివారులో ఉన్న భూమికి పట్టాదారు పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన చీకటి కిషోర్ కుమార్ గౌడ్ తమ గ్రామపంచాయతీలో మురుగు కాలువపై నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి. రాములు, మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులతో సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు..

**ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**

ఆమనగల్ పట్టణంలో మాల కుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా స్థానిక పోచమ్మ దేవాలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో పూజారి నాగభూషణం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల నుంచి బోనాలను ఎత్తుకొని ఊరేగింపు పోచమ్మ ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు పూజలలో మార్కెట్



మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు కౌన్సిలర్ రమేష్ మాజీ కౌన్సిలర్ చెన్నకేశవులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాలే మల్లయ్య నాయకులు దేవేందర్ చంద్రయ్య మల్లేష్ సతీష్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం మహిళలు తమ ఇళ్ల నుంచి బోనాలను ఎత్తుకొని ఊరేగింపు పోచమ్మ ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# 1,000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీల అమలు ఏది?

**•ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైంది: సబితా ఇంద్రారెడ్డి**

త్రినెట్ న్యూస్, ఆగస్టు 31

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 1,000 రోజులు పూర్తవుతున్నప్పటికీ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో అనేకం పూర్తిస్థాయిలో అమలు కాలేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు.

మహేశ్వరం నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలుపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. హామీలను అమలు చేయకుండా వివిధ కార్యక్రమాలు, సభలు, సమావేశాలతో కాలయాపన చేస్తోందని ఆమె ఆరోపించారు.

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ముఖ్యంగా రైతులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.



రైతు సంక్షేమం, బీమా తదితర అంశాల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం సమీక్షించి, అర్హులైన రైతులకు ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కార్మికులు, పేదలు, మహిళలు, నిరుద్యోగులు, గ్రామీణ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై కూడా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని అన్నారు.

గతంలో ప్రజల అవసరాలను గుర్తించి అర్హులైన లబ్ధిదారుల వివరాలను సేకరించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేశామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.



"ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలి. ఎన్ని హామీలు అమలు చేశారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? అనే అంశాలను స్పష్టంగా ప్రజల ముందుంచాలి" అని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

కేవలం సభలు, సమావేశాలు నిర్వహించడం కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని ఆమె అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మహేశ్వరం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ వెల్దండ మండల అధ్యక్షులుగా మంగళగిరి శ్రీను



త్రినెట్ న్యూస్, ఆగస్టు 31

వెల్దండ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులుగా మంగళగిరి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి గ్రామాలలో గ్రామ కమిటీల నిర్మాణం కోసం జరుగుతున్న కార్య చరణలో భాగంగా వెల్దండ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుని ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆడెపు నాగార్జున మాదిగ మద్దిలేటి మాదిగ హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ కోసం సాధించిన ఫలాలు మాదిగలు వినియోగించుకోవాలని అన్నారు కుల వివక్షత అస మానతలు తొలగిపోవాలంటే పోరాటాలతోనే సాధ్యమని అందుకు ఉద్యమానికి మాదిగలు సిద్ధంగా ఉండాలని తెలియజేశారు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మంగళగిరి శ్రీను ఉపాధ్యక్షులు బూత్కూరి పరమేష్ కోశాధికారి దుబ్బ రామార్జున్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రాజు మాదిగ కురుమిద్ద యాదగిరి గెల్వాయ్య మాదిగ పెద్దయ్య గంగ పోగు నరసింహ మంగళగిరి సత్యం గంగ పోగు సాయిబాబు ఈదులపల్లి అనిల్ కుమార్ జోగు రవికుమార్ ఈదులపల్లి జగన్

## సదరం క్యాంపుకు అర్హులైన దివ్యాంగులను గుర్తించాలి : ఎంపీడీఓ. సంకీర్త్ .

త్రినెట్ న్యూస్, ఆగస్టు 31



పినపాక మండలంలోని గ్రామ సర్పంచ్‌లు సెప్టెంబర్ నెల సదరం క్యాంపులకు అర్హులైన దివ్యాంగులను వెంటనే గుర్తించి, నమోదు చేయించాలని ఎంపీడీవో సంకీర్త్ సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సర్పంచులు బాధ్యతగా గ్రామాల్లో డప్పు, మైక్ ప్రకటనలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు అవసరమైన పత్రాలతో హాజరయ్యేలా చూడాలని, ఆశా, అంగన్‌వాడీ, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఒక్క అర్హుడు కూడా మిగలకుండా చర్యలు తీసుకుని, నమోదు వివరాలను వెంటనే మండల కార్యాలయానికి తెలియజేయాలని ఆదేశించారు.

## రైస్ మిల్లు కాలుష్యాన్ని అరికట్టండి : భూపాలపట్నం గ్రామస్తులు.

త్రినెట్ న్యూస్, ఆగస్టు 31



పినపాక మండలం భూపాలపట్నం గ్రామంలోని నివాస ప్రాంతాల మధ్య ఉన్న రైస్ మిల్లుల నుంచి వెలువడుతున్న ధూళి, దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాలుష్యాన్ని అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ సంకీర్త్‌కు గ్రామస్తులు, సర్పంచ్ తొలేం స్వప్న, ఉపసర్పంచ్ నిట్టా శిరీషతో కలిసి వినతిపత్రం అందజేశారు. మిల్లును పరిశీలించి, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాజమల్ల అరవింద్, సల్ల అనిల్, రాజమల్ల వాసు, సల్ల మోహన్, పిట్టా రవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వైర్లతో రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఏఈ వేణుగోపాల్ .

త్రినెట్ న్యూస్, ఆగస్టు 31



రైతులు వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విద్యుత్ వైర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పినపాక మండల విద్యుత్ శాఖ ఏఈ వేణుగోపాల్ సూచించారు. సోమవారం పినపాక మండలం ఈ బయ్యారం విద్యుత్ ఉపకేంద్రంలో మాట్లాడుతూ పొలాల్లో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే వైర్లను పొలాల గట్లపై వేలాడదీయడం, నిర్లక్ష్యంగా పడవేయడం చేయవద్దని తెలిపారు. వ్యవసాయ పనులు చేసే సమయంలో విద్యుత్ వైర్లను తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైర్లలో ఏమైనా లోపాలు, తెగిపోయిన తీగలు కనిపిస్తే వాటిని తాకకుండా వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు. విద్యుత్ పరికరాల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా భద్రతా చర్యలు పాటించాలని రైతులకు సూచించారు. అలాగే కొంతమంది అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలియజేశారు. అక్రమంగా విద్యుత్ వాడడం నేరమని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అర్హత గల రైతులు నూతన కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## చింతపల్లి మండలంలో అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

**•సెప్టెంబర్ 3న అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహణ**

**చింతపల్లి,**

త్రినెట్ న్యూస్, ఆగస్టు 31



చింతపల్లి మండలంలోని వివిధ అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 10 అంగన్వాడీ టీచర్ మరియు 7 అంగన్వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి అర్హత సాధించిన అభ్యర్థులకు సెప్టెంబర్ 3న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ సక్కుబాయి తెలిపారు. దేవరకొండ ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని, అర్హులైన అభ్యర్థులకు ఇప్పటికే కాల్ లెటర్లు అందజేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు కాల్ లెటర్‌లో పేర్కొన్న సూచనలను పరిశీలించి, అవసరమైన అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో నిర్ణీత సమయానికి హాజరుకావాలని సూచించారు. టీచర్ పోస్టులు నసర్లపల్లి--2, బాలాజీ తండా, కిష్టరాంపల్లి--1, వర్కాల--1, ఎం. మల్లేపల్లి (సాయిరెడ్డిగూడెం),కురంపల్లి--1, కురంపల్లి--2, పి.కె. మల్లేపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో ఉండగా, హెల్పర్ పోస్టులు గాసిరాం తండా, దేన్య తండా, రెడ్డి నాయక్ తండా, బాలాజీ తండా, దేవుల తండా, ఎర్రమట్టి తండా, ప్రశాంతిపురి తండా కేంద్రాల్లో భర్తీ చేయనున్నట్లు సక్కుబాయి తెలిపారు.

## అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం.

త్రినెట్ న్యూస్, ఆగస్టు 31




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలంలోని కస్తూర్బా బాలిక విద్యాలయంలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో సంకీర్త్, ఎంఈఓ కే. నాగయ్య తెలిపారు. సోమవారం పినపాక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన స్థానిక మహిళలు సెప్టెంబర్ 1 నుంచి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని ఈ పోస్టుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని , గెజిటెడ్ అధికారి చే ధ్రువీకరించబడిన అర్హత నకళ్ళతో పాటు బయోడేటా ఫామ్ ను పినపాక (ఐలాపురం) లోని కస్తూర్బా పాఠశాలలో అందజేయాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియ నిబంధనల ప్రకారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## దోషులకు కఠినమైన శిక్షలు విధించాలి : గొగ్గల రామకృష్ణ.

త్రినెట్ న్యూస్, ఆగస్టు 31



శిరీష మృతికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న సానద్ ఉల్లా ఖాన్‌పై నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సంఘం జిల్లా అధ్యక్షులు గొగ్గల రామకృష్ణ , ప్రధాన కార్యదర్శి కొమరం శ్రీను డిమాండ్ చేశారు. పినపాక మండల కేంద్రంలో మాట్లాడుతూ ములకలపల్లి మండలం ,చవిటిగూడెం గ్రామానికి చెందిన నర్సు ఊకె శిరీష మృతి ఘటనపై జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది నేరం రుజువైతే చట్ట ప్రకారం కఠిన శిక్ష విధించాలని కోరారు. మహిళలు రాత్రి వేళల్లో విధులు నిర్వహించే నర్సులకు పూర్తి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. శిరీష కుటుంబానికి తక్షణ న్యాయం, తగిన పరిహారం, రక్షణ కల్పించాలని, న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయపోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

## శ్రీ శివపరాశక్తి పీఠంలో స్వామి, అమ్మ వారలకు విశేషపూజలు





త్రినెట్ న్యూస్, ఆగస్టు 31

పవిత్ర సోమవారం సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని శివా పరాశక్తి పీఠంలో స్వామి అమ్మవార్లకు అత్యంత భక్తిశ్రద్ధలతో, విశేషపూజలు కన్నులపండుగగా జరిగాయి.

శివ పరాశక్తి పీఠాధిపతులు మనోహర్ గురుస్వామి ?ఉదయం స్వామివారికి పంచామృతాం, గంధం భస్మంతో మహాభిషేక కార్యక్రమం వైభవంగా నిర్వహించారు, అభిషేకానంతరం స్వామివారికి సమర్పించిన సప్త హారతుల ఏడు హారతులు దృశ్యం భక్తులందరికీ నయనానందకరాన్ని కలిగించింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం అందరిలోనూ అపారమైన భక్తిభావాన్ని పెంపొందించింది. పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తజనులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు

## సిరిసిల్ల జిల్లాలో మోగిన రైలు కూత బస్వాపూర్ వరకు విజయవంతంగా ట్రయల్ రన్

త్రినెట్ న్యూస్, ఆగస్టు 31



కొత్తపల్లి మనోహరాబాద్ నూతన రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో భాగంగాజిల్లా సరిహద్దులోని తంగళ్ళపల్లి మండలం బస్వాపూర్ రైల్వే స్టేషన్ వరకు నిర్వహించిన రైల్వే ట్రయల్ రన్ విజయవంతమైందితొలిసారిగా జిల్లా సరిహద్దు ప్రాంతంలోకి రైలు వచ్చి కూత పెట్టడంతో స్థానిక ప్రజలు రైతులు ఆనందంలో మునిగిపోయారు సిద్దిపేట మార్గం నుంచి బస్వాపూర్ స్టేషన్ వరకు రైల్వే అధికారులు ఇంజిన్‌ను నడిపి పట్టాలు సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారుదశాబ్దాలుగా రైలు సౌకర్యం కోసం నిరీక్షిస్తున్న గిరిజన గ్రామీణ ప్రాంత ప్రజలు రైలు రాకను చూసి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు ఈ మార్గం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సిరిసిల్లలోని చేనేత జౌళి ఉత్పత్తుల రవాణాకు కొత్త ఊపిరి అందడమే కాకుండా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు రవాణా కష్టాలు తప్పనున్నాయి త్వరలోనే సిరిసిల్ల పట్టణ శివారు వరకు పనులు పూర్తి చేసి ప్రయాణికుల రైళ్లను అందుబాటులోకి తెస్తామని అధికారులు తెలిపారు.

# నష్టాల్లో ముగిసిన సూచీలు..
# సెన్సెక్స్ 307 పాయింట్లు డౌన్

దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. భౌగోళిక ఉద్రిక్త పరిస్థితులు సూచీలపై మరోసారి ప్రభావం చూపాయి. అమెరికా-- ఇరాన్ పరస్పరం దాడులకు దిగడం, క్రూడాయిల్ ధరలు మళ్లీ పెరగడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్ సూచీలు నష్టపోయాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, రియాల్టీ, మీడియా షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది.




**సెన్సెక్స్**
76,957.27
▼ 307.24
( -0.40% )

**నిఫ్టీ**
24,080.40
▼ 95.25
( -0.39% )

**రూపాయి విలువ**
1 USD = ₹95.22
(క్రితం ముగింపు: ₹95.18)

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 77,130.73 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,264.51) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది.

రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,751.32 వద్ద కనిష్టాన్ని తాకిన సూచీ.. చివరికి 307.24 పాయింట్ల నష్టంతో 76,957.27 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ సైతం 95.25 పాయింట్ల నష్టంతో 24,080.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మార్కం విలువ 95.22గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. సన్ ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు లాభపడ్డాయి.

**క్రూడ్ ఆయిల్ (Brent)**
$91.31 ప్రతి బ్యారెల్

**బంగారం (Gold)**
$4,451 ప్రతి ఔన్స

**అంతర్జాతీయ మార్కెట్లు**
అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, క్రూడాయిల్ ధరల పెరుగుదలతో ప్రపంచ మార్కెట్ల ఒత్తిడిలో కొనసాగుతున్నాయి.

## అంతరిక్ష రంగం తరహాలో అణు విద్యుదుత్పత్తి!

**వాణిజ్య ఉత్పత్తి బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు బదిలీ చేయాలి**
**టీసీఈ ఎండీ, సీఈఓ అమిత్ శర్మ**

ముంబయి: అంతరిక్షరంగంలో ప్రైవేటు సంస్థలకు అవకాశం కల్పించాక, ఎంతటి విజయాలు లభిస్తున్నాయో చూస్తున్నామని.. అదే తరహాలో అణు ఇంధన రంగంలోనూ వాణిజ్య ఉత్పత్తికి ప్రైవేటు సంస్థలకు అవకాశం కల్పించాలని దేశ అణు కార్యక్రమంతో 5 దశాబ్దాలకు పైగా అనుబంధం ఉన్న టాటా కన్సల్టింగ్ ఇంజినీర్స్ (టీసీఈ) కోరింది. అణు ఇంధన విభాగం (డీఏఈ) జాతీయ వ్యూహాత్మక లక్ష్యాలపై ప్రధానంగా దృష్టి కొనసాగిస్తూనే, వాణిజ్య విద్యుత్ ఉత్పత్తి బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేసింది. అంతరిక్ష రంగం వృద్ధి వేగాన్ని పెంచడంలో తోడ్పడిన ప్రభుత్వ రంగ అంతరిక్ష సంస్థ ఇస్రో నుంచి ఈ విషయంలో డీఏఈ స్ఫూర్తిని పొందాలని టీసీఈ ఎండీ, సీఈఓ అమిత్ శర్మ సూచించారు. 'డీఏఈ జాతీయ వ్యూహాత్మక లక్ష్యాల కోసం ఏర్పాటైందే కానీ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి కాదు. అది తన ప్రధాన గుర్తింపును నిలుపుకోవాలి. అణు విద్యుదుత్పత్తిపై ప్రైవేటు రంగాన్ని పూర్తిగా పని చేయనివ్వాల'ని అమిత్ కోరారు. ప్రైవేటు రంగ సంస్థలు తమ నమూనాలను పరీక్షించుకునేందుకు, ముంబయిలోని బాబా అటామిక్ రీసెర్చ్ కేంద్రం (బార్క్) వంటి సంస్థల్లోని



ప్రయోగశాలలను అందుబాటులో ఉంచాలని అమిత్ సూచించారు. చైనా, అమెరికా, దక్షిణ కొరియా వంటి దేశాలు ఇప్పటికే వ్యవస్థాగత కార్యక్రమాల ద్వారా ఇలాంటి చర్యలు చేపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రైవేటు రంగం వాటా పెరిగే కొద్దీ 2030 ఆర్థిక సంవత్సరం చివరికి తమ మొత్తం రూ.3000 కోట్ల ఆదాయంలో, అణు విద్యుత్ రంగ వాటా ప్రస్తుత 2% నుంచి 5-6 శాతానికి పెరుగుతుందని టీసీఈ అంచనా వేస్తోంది.




## ఇంటర్నెట్ లేకున్నా.. యూపీఐ చెల్లింపులు

ఫీచర్ ఫోన్ వినియోగదారుల కోసం ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇంటర్నెట్ లేకపోయినా వారు యూపీఐ చెల్లింపులు చేసేందుకు వీలుగా 'UPI 123Pay' సర్వీస్‌ను ఆవిష్కరించింది. దీంతో 20 కోట్ల మందికి పైగా ఫీచర్ ఫోన్ వినియోగదారులు డిజిటల్ చెల్లింపులు చేసేందుకు వీలు కలగనుంది. 2జీ కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో నమ్మకమైన లావాదేవీలు నిర్వహించేందుకు ఎస్ఎంఎస్ ఆధారిత వ్యవస్థను ఈ యూపీఐ123పే ఉపయోగించుకుంటుంది. ఈ సర్వీస్‌ను విస్తరించేందుకు నోకియా, హెచ్ఎండీ, లావా ఇంటర్నేషనల్, ఐటెల్ మొబైల్ సంస్థలతో ఫోన్‌పే భాగస్వామ్యం కుదుర్చుకుంది. ప్రీ బండిల్డ్‌గా.. అంటే ఫోన్ కొనుగోలు చేసేటప్పుడు ఫోన్‌తో పాటే వస్తుంది.

**ఇంటర్నెట్ లేకున్నా ఖూx చెల్లింపులు**
**'ఖూx 123ఞుఖుఎ' సేవను ఫోన్‌పే ఆవిష్కరణ**
**20 కోట్ల మందికి పైగా వినియోగదారులకు ప్రయోజనం**
**2జీ నెట్‌వర్క్‌లోనూ లావాదేవీలు**
**ూమీూ ఆధారంగా చెల్లింపుల వ్యవస్థ**
**వ్యక్తులు, వ్యాపారులకు పేమెంట్లు**
**కెమెరా ఫోన్లతో స్కాన్ చేసి చెల్లింపులు**
**బ్యాలెన్స్, లావాదేవీ హిస్టరీ చెక్ చేసుకోవచ్చు**
**12 భారతీయ భాషల్లోూూx హెల్ప్‌లైన్**
**త్వరలో బిల్లు పేమెంట్లు, రీఛార్జ్ సేవలు**


"స్మార్ట్‌ఫోన్‌లకే పరిమితమైన డిజిటల్ చెల్లింపులు 'ఖూ× 123ఞుఖుఎ' సర్వీస్ ద్వారా దేశంలోని ప్రతి మూలకూ విస్తరిస్తాయి" అని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ అన్నారు. అందరికీ సమానస్థాయిలో సేవలు అందించే ఉద్దేశంతోనే దీనిని తీసుకొచ్చామన్నారు. దీనిద్వారా యూజర్లు వ్యక్తులకు, వ్యాపారులకు చెల్లింపులు చేయొచ్చని పేర్కొన్నారు. కెమెరా కలిగిన ఫీచర్ ఫోన్ వినియోగదారులు స్కాన్ చేసి చెల్లింపులు చేయొచ్చు. కేవలం చెల్లింపులే కాకుండా బ్యాలెన్స్ తనిఖీ చేయడం, లావాదేవీ హిస్టరీ కూడా తెలుసుకోవచ్చు. తొలిసారి ఈ సదుపాయాన్ని వినియోగించే వారి కోసం ఏఐ హెల్ప్‌లైన్‌ను కూడా ఫోన్‌పే అందుబాటులోకి తెచ్చింది. ఇంగ్లిష్ సహా 12 భారతీయ భాషల్లో ఈ సేవల్ని వినియోగించాలో వివరిస్తుంది. భవిష్యత్‌లో బిల్లు పేమెట్లు, రీఛార్జీ వంటి సేవలనూ అందుబాటులోకి తెస్తామని ఫోన్‌పే తెలిపింది.

## మధుమేహానికీ DASH ఆహార పద్ధతి.. వివరాలివీ

అధిక రక్తపోటును తగ్గించుకోవటానికి డైటరీ అప్రోచెస్ టు స్టాప్ హైపర్‌టెన్షన్ (ణూూాఎ) ఆహార పద్ధతిని చాలాకాలంగా అనుసరిస్తున్నారు. ఇది మధుమేహుల్లో గ్లూకోజు మోతాదులు అదుపులో ఉండటానికీ తోడ్పడుతున్నట్టు తాజాగా బయటపడింది. కాకపోతే డ్యాష్ పద్ధతిని స్వల్పంగా మార్చటం గమనార్హం. (ణఖుఎవివం)

డ్యాష్ అనేది సరళమైన ఆహార పద్ధతి. ఇందులో పండ్లు, కూరగాయలు, తవుడుతో కూడిన ధాన్యాలు, వెన్న తీసిన పాలు, పప్పులు, గింజ పలుకులు. మాంసాహారులకైతే చికెన్, చేపల వంటి వాటికి ప్రాధాన్యమిస్తారు. అదే సమయంలో ఉప్పు పరిమితం చేసుకోవటం చాలా ముఖ్యం. ఏ విధంగా చూసినా ఉప్పు రోజుకు 2,300 మి.గ్రా. కన్నా మించనీయొద్దు. 1,500 మి.గ్రా. మించకపోతే ఇంకా ఉత్తమం. అలాగే మాంసం, మిఠాయిలు, చక్కెర, తీపి పానీయాలు, ఆహార ఉత్పత్తులు (చక్కెర, ఉప్పు, కొవ్వు కలిపి తయారుచేసేవి) తగ్గించుకోవాలి.

ఈ డ్యాష్ పద్ధతి రక్తపోటును తగ్గించటం ద్వారా గుండె ఆరోగ్యం మెరుగవటానికి తోడ్పడుతున్నట్టు చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే మధుమేహం గలవారిలో రక్తంలో గ్లూకోజు మోతాదుల మీద ఎలాంటి ప్రభావం చూపుతుందనేది స్పష్టంగా తెలియరాలేదు. అందుకే కొత్త అధ్యయనంలో దీనిపై దృష్టి సారించారు.




**కొద్దిగా మార్చి..**

రక్తపోటును సమర్థంగా తగ్గిస్తున్నందున డ్యాష్ పద్ధతిని మధుమేహం, ఇతర సమస్యలు గలవారికీ తరచూ సూచిస్తుంటారు. అయితే గ్లూకోజు నియంత్రణ కోసం పరిశోధకులు డ్యాష్ పద్ధతిలో స్వల్పంగా మార్పులు చేశారు. తీపి పదార్థాలు, పిండితో కూడిన బంగాళాదుంపల వంటి వాటిని మరింతగా తగ్గించారు. దీనికి డ్యాష్ 4డీ అని పేరు పెట్టారు.

కొందరు మధుమేహులను ఎంచుకొని ఐదు వారాల పాటు దీని ప్రభావాన్ని పరిశీలించారు. మామూలు ఆహారం తీసుకున్నవారితో పోలిస్తే డ్యాష్4డీ పద్ధతిని పాటించినవారిలో రక్తంలో గ్లూకోజు నిర్ణీత మోతాదుల్లో ఎక్కువసేపు స్థిరంగా ఉన్నట్టు గుర్తించారు.

డ్యాష్ పద్ధతి రక్తంలో గ్లూకోజు మోతాదులను గణనీయంగా మెరుగుపరుస్తున్నట్టు ఒక నియంత్రిత అధ్యయనంలో తేలటం ఇదే తొలిసారని జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ ఎలిజబెత్ సెల్విన్ చెబుతున్నారు.



# నటనను అదృష్టంగా భావిస్తా!: రాశీఖన్నా

ఎదురొచ్చిన అవకాశాన్ని అందుకుంటూ తనేంటో నిరూపించుకుంది అందాల తార రాశీఖన్నా. ప్రేమకథలు, యాక్షన్ ఎంటర్‌టైనర్‌లతో ఇటు దక్షిణాదితో పాటు.. బాలీవుడ్‌లోనూ మంచి క్రేజ్ సంపాదించుకుందీ భామ. 2013లో 'మద్రాస్ కేఫ్'తో నాయికగా సినీప్రయాణం మొదలెట్టిన ఈమె.. ఈ మధ్యే చిత్రపరిశ్రమలోకి వచ్చి 13ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే రాశి తన కెరీర్‌ను గుర్తు చేసుకుంటూ ఆనందం వ్యక్తం చేసింది. "13ఏళ్లు అనేది సుదీర్ఘ సమయం. కానీ నటనను ఎప్పుడూ ఒక అదృష్టంగానే భావించాను. అందుకే సమయం తెలియకుండానే వేగంగా గడిచిపోయింది. 'మద్రాస్ కేఫ్' రోజుల్ని గుర్తుచేసుకుంటే నా ప్రయాణం ఎందుకు మొదలైందో తెలుస్తుంది. నాకు ముఖ్యమైన కథలను చెప్పే అవకాశాన్ని అది నాకు ఇచ్చింది. ఈ ప్రయాణంలో ఎన్నో అనుభవాలు, జ్ఞాపకాలను పోగుచేసుకున్నా. నన్ను ఆదరించి నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని చెప్పుకొచ్చింది రాశి. ప్రస్తుతం ఆమె 'ఫర్జీ 2', 'ధర్మన్' లాంటి సినిమాల షూటింగ్‌లతో బిజీగా గడుపుతోంది.

# పుట్టబోయే బిడ్డకు సామ్రాజ్ పేరు.. సమంత ఫన్నీ కామెంట్



నటి సమంత, రాజ్ నిడిమోరు త్వరలో తల్లిదండ్రులు కానున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం సినిమాలకు విరామం తీసుకున్న సామ్.. ప్రెగ్నెన్సీలోని ప్రతిక్షణాన్ని ఆస్వాదిస్తూ అభిమానులతో రోజూ టచ్‌లో ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల సోషల్ మీడియా వేదికగా ఫ్యాన్స్‌తో చిట్ చాట్ నిర్వహించిన ఆమె.. పుట్టబోయే బిడ్డకు పేరు పెట్టడంలో సాయం కావాలని కోరారు. దీంతో అభిమానులు ఎన్నో పేర్లు సూచించారు. ఇందులో ఒక నెటిజన్ చెప్పిన పేర్లకు సమంత ఇచ్చిన ఫన్నీ రిప్లై ప్రస్తుతం వైరల్ అవుతోంది.సమంత, రాజ్ పేర్లు కలిసి వచ్చేలా.. పాప పుడితే 'సమైరా' అని, బాబు పుడితే 'సామ్రాజ్' అని పెట్టుకోవాలని ఒక అభిమాని కామెంట్ చేశారు. 'సామ్రాజ్' పేరుపై సమంత స్పందిస్తూ.. "మన గురించి మనమే మరీ ఎక్కువగా ఊహించుకుంటున్నట్లు అనిపించడం లేదూ?" అంటూ నవ్వుతున్న ఎమోజీలను జోడించారు . ఈ ఏడాది జూన్‌లో సమంత తన ప్రెగ్నెన్సీని ప్రకటించారు. ఈ శుభవార్తను పంచుకుంటూనే తాను సినిమాలకు కొన్ని రోజులు విరామం తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రెగ్నెన్సీ సమయంలో ఇప్పటికే 11 కిలోల బరువు పెరిగానని.. ఈ అనుభూతిని మనసారా ఆస్వాదిస్తున్నట్లు ఇటీవల చెప్పారు.

# 'అర్జున్‌రెడ్డి' కోసం మేం ఒక యుద్ధమే చేశాం!

"సందీప్‌రెడ్డిపై నమ్మకంతో వాళ్ల కుటుంబం పొలాన్ని పెట్టి 'అర్జున్‌రెడ్డి' చేసింది. అంతే నమ్మకం నాపైన పెట్టి ఆ సినిమాని నాతో చేశాడు తను. ఆ నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్ అంటే నాకెంతో ప్రత్యేకం. ఆ సంస్థ నుంచి వస్తున్న 'రోమాంచకం' పెద్ద విజయం సాధించాలి" అన్నారు ప్రముఖ కథానాయకుడు విజయ్ దేవరకొండ. ఆయన ముఖ్య అతిథిగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో 'రోమాంచకం' విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్‌కుమార్ జంటగా నటించిన చిత్రమిది.



ప్రణయ్, వేణుగోపాల్, సందీప్, విజయ్, సుమంత్ ప్రభాస్, అనంతిక

వేణుగోపాల్ రెడ్డి దర్శకుడు. భద్రకాళి పిక్చర్స్ పతాకంపై ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మించారు. సందీప్ రెడ్డి వంగా సమర్పకులు. ఈ చిత్రం సెప్టెంబర్ 3న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకకు విజయ్‌తోపాటు సినీ ప్రముఖులు మెహర్ రమేశ్, శౌర్యవ్, సునీల్ నారంగ్ హాజరయ్యారు.వేడుకని ఉద్దేశించి సందీప్‌రెడ్డి వంగా మాట్లాడుతూ "నాకూ, విజయ్‌కీ ఆగస్టు 24న 'అర్జున్‌రెడ్డి' సినిమాతో కలిగిన అనుభూతి దర్శకుడు వేణుకీ, ఈ చిత్రబృందానికీ కలగాలి. పేరుకే నేను సమర్పకుడిని కానీ, ఈ సినిమా కోసం మా అన్న ప్రణయ్, ఇతర బృందం ఎంతో శ్రమించింది. ఈ సినిమాని చూసి ప్రతి ఒక్కరూ నవ్వుకుంటూ థియేటర్ నుంచి బయటికొస్తారు. వేడుకకు వచ్చిన విజయ్ దేవరకొండకూ, ఇతర అతిథులకూ నా కృతజ్ఞతలు" అన్నారు.విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "సందీప్‌పై నాకున్న ప్రేమ మాటల్లో చెప్పలేను. మాది ఒక ప్రత్యేకమైన బంధం. మేం 'అర్జున్‌రెడ్డి' కోసం ఒక యుద్ధం చేశాం. అది ఆడకపోతే పిచ్చోళ్లు అయిపోయేవాళ్లం. అప్పటికి 'పెళ్లిచూపులు' కూడా విడుదల కాలేదు. నాకు ఇంత మంది అండ కూడా లేదు. ఆ సమయంలోనే సందీప్ నా కోసం ఎంతవరకైనా వెళ్లడానికి సిద్ధమయ్యేవాడు. నేనూ తన కోసం అంతే. ఈ వేడుకకి వచ్చినందుకు తను నాకు కృతజ్ఞతలు చెబుతున్నాడు. సందీప్ పిలిచినప్పుడు రాకపోతే నేను బతికి వృథా కదా! సుమంత్‌కి ఊహించని విజయం దక్కుతుంది" అన్నారు.సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ "విజయ్ దేవరకొండ ఆయన మళ్లీ ఈ వేడుకకి రావడం చాలా ఆనందంగా ఉంది. భారతదేశం మొత్తం మన పరిశ్రమ గురించి మాట్లాడుకునేలా చేసిన సందీప్‌రెడ్డి నిర్మాణంలో సినిమా చేస్తుంటే నేనూ పెద్ద హీరో అయిపోయాననే అనుభూతి కలుగుతోంది. అందుకు ఈ సినిమా ఓ మైలురాయిగా నిలుస్తుంది. ఈ సినిమాలోని అందమైన పాత్రలు, వాటి అమాయకత్వం అందరికీ నచ్చేస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.



# భక్తి ప్రధాన సినిమాతో అల్లరి నరేశ్

కథానాయకుడు అల్లరి నరేశ్ ఓ భక్తి ప్రధాన చిత్రంతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'కనకదుర్గ' పేరుతో రూపొందుతున్న ఈ సినిమాని ప్రదీప్ మద్దాలి తెరకెక్కిస్తున్నారు. బిర్లా స్టూడియోస్, టెంపుల్ టౌన్ పిక్చర్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. కాజల్ చౌదరి కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాని త్వరలో థియేటర్లలో విడుదల చేసి.. ఆ తర్వాత జీ5లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు ఆదివారం ప్రకటించారు. "భక్తి, యాక్షన్, భావోద్వేగాల మేళవింపుగా రూపొందుతున్న చిత్రమిది. కనకదుర్గ అమ్మవారి దివ్యశక్తిని, ఆమె పట్ల ఉన్న భక్తిభావాన్ని ఆవిష్కరిస్తూనే.. ఈతరం ప్రేక్షకులకు ఓ మంచి సినిమాటిక్ అనుభూతిని అందించేలా దీన్ని రూపొందిస్తున్నాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి బీవీఎస్ రవి కథ అందించగా.. తమన్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంది.. తనయుడికి మహేశ్ బాబు బర్త్‌డే విషెస్



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు తన కుమారుడు గౌతమ్ ఘట్టమనేని కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. గౌతమ్ నేడు 20వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు. వారిద్దరి ఫొటోను పంచుకుంటూ 'ప్రతిరోజూ నిన్ను చూసి గర్వపడుతున్నా' అంటూ రాసుకొచ్చారు. "హ్యాపీ 20 గౌతమ్.. నీ జీవితంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. నీ కలలను ఎప్పుడూ ధైర్యంగా సాకారం చేసుకోవాలి. నేను ప్రతిరోజూ నిన్ను చూసి గర్వపడుతున్నా" అని మహేశ్ బాబు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. మహేశ్ అభిమానులు కూడా గౌతమ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.నమ్రతా శిరోద్కర్ కూడా గౌతమ్‌కు శుభాకాంక్షలు చెబుతూ పోస్టు పెట్టారు. 'పుట్టినరోజు శుభాకాంక్షలు గౌతమ్.. నువ్వు నీ కలలు, లక్ష్యాలన్నింటినీ సాధించాలని కోరుకుంటున్నా. ఎప్పటికీ నిన్ను ప్రేమిస్తూనే ఉంటా' అని ఆమె ఇన్‌స్టా వేదికగా రాసుకొచ్చారు.

# సీడ్ గణేశుడిని పూజించండి.. చిరంజీవి పిలుపు



హైదరాబాద్: ప్రకృతి సంరక్షణ కోసం, పచ్చదనం పెంపుకోసం ఈ సారి అందరూ సీడ్ గణేశుడిని పూజించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. సీడ్ గణేశుడిని పూజించి ఆ తర్వాత ఇంట్లోనే నిమజ్జనం చేయడం వల్ల.. వినాయకుడు మొక్కై ఎదిగి మనల్ని ఆశీర్వదిస్తాడని తెలిపారు. 'గ్రీన్ ఇండియా చాలెంజ్' రూపొందించిన సీడ్ గణేశా ప్రతిమలను చిరంజీవి తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను ఓ యజ్ఞంలా భావించి ఇప్పటికే 20 కోట్ల మొక్కలు నాటేలా లక్షల మందిని ప్రోత్సహించిన సంతోష్.. అభినందనీయుడని, ఆయన దీక్షకు తమ వంతు తోడ్పాటు ఉంటుందని ప్రశంసించారు.



# పీచు లేకపోతే పేగుకే మోసం

శాకాహారం ఆరోగ్యానికి మేలు
పీచు మంచి బ్యాక్టీరియాకు ఆహారం
పీచుతో ఆరోగ్యకర సమ్మేళనాలు
కణాలకు రక్షణ కల్పించే యాంటీఆక్సిడెంట్లు
పీచు లేకుంటే పేగుల రక్షణ పొర దెబ్బతినొచ్చు
శాక ప్రొటీన్లకూ కీలక పాత్ర
పీచు వాపును తగ్గించడంలో సహాయం
రోజూ పీచు పదార్థాలు తీసుకోవాలి

**పీచు తక్కువైతే.. పేగులకే ముప్పు!**

**కూరగాయలు, పండ్లలోని పీచు.. పేగు బ్యాక్టీరియాను ఆరోగ్యకరంగా మారుస్తుంది**

కూరగాయలు, పండ్లతో కూడిన శాకాహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అంతా పీచు, వృక్ష రసాయనాల మహత్తే. పీచేమో పేగుల్లో మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా మారుతుంది. వృక్ష రసాయనాలేమో కణాలకు రక్షణగా నిలుస్తాయి. అయితే శాకాహారంలో ఉండే బోలెడన్ని భాగాలను పేగు బ్యాక్టీరియా కచ్చితంగా ఎలా వర్గీకరించుకుంటుంది? వీటి మధ్య జరిగే చర్యతో ప్రయోజన కారకాలు ఎలా పుట్టుకొస్తాయి? వీటిని అర్థం చేసుకోవటానికి శాస్త్రవేత్తలు చాలాకాలంగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. కొత్త కొత్త విషయాలు బయటపడుతూనే ఉన్నాయి.

శాకాహారంలో జీర్ణం కాని ప్రొటీన్లు దండిగా ఉంటాయి. పీచు, ప్రొటీన్స్ ఇమిటేటింగ్ ఫైబర్ (ప్రిఫ్స్) మాదిరిగా పనిచేసే ఇవి పేగుల లోపలికి చేరుకొని, బ్యాక్టీరియాకు ఆరోగ్యకర ప్రొటీన్లను అందిస్తాయి. వీటి నుంచే మేలు చేసే రసాయన సమ్మేళనాలు పుట్టుకొస్తాయి. బ్యాక్టీరియాకు తగినంత పీచు అందుబాటులో లేకపోతే ఏమవుతుంది? మన ప్రొటీన్లనే.. ముఖ్యంగా పేగుల లోపల రక్షణ కల్పించే జిగురు పొరను తినటం మొదలెడుతుంది! దీన్ని బ్యాక్టీరియా జీర్ణం చేసుకునే క్రమంలో హానికర సమ్మేళనాలు పుట్టుకొస్తాయి. ఈ ప్రక్రియపై లుడ్విగ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్యాన్సర్ రిసెర్చ్ చేపట్టిన రెండు కొత్త అధ్యయనాలు సరికొత్త విషయాలను వెల్లడించాయి. పీచు, ఆయా శాక ప్రొటీన్లు పేగు బ్యాక్టీరియా జీవక్రియలను మార్చటం ద్వారా హాని కారకాలను తగ్గించి, మేలు చేసే పదార్థాలను ఎక్కువగా ఉత్పత్తి చేసేలా పురికొల్పుతున్నట్టు ఒక అధ్యయనంలో తేలింది. పీచు మూలంగా పేగు బ్యాక్టీరియాతో పుట్టుకొచ్చే ముఖ్యమైన జీవక్రియ పదార్థాలు పెద్దమొత్తంలో ఉత్పత్తి అవుతున్నట్టు మరో అధ్యయనం పేర్కొంటోంది.

నిజానికి ఆరోగ్యకర ఆహారంలో పీచు ఒక ముఖ్యమైన భాగంగా ఎప్పటి నుంచో గుర్తిస్తున్నాం. కానీ జీర్ణం కాని శాక ప్రొటీన్ల మీద మాత్రం అంతగా దృష్టి పెట్టలేదు. పేగు బ్యాక్టీరియా ప్రిఫ్స్, పీచును తింటున్నప్పుడు ఆరోగ్యకరమైన రసాయన సమ్మేళనాలు పుట్టుకొస్తాయి. ఇవి విశృంఖల కణాల పనిపట్టే యాంటీఆక్సిడెంట్లు, వాపు ప్రక్రియను నివారించే కారకాలుగా పనిచేస్తాయి. ఇలా ఒత్తిడికి పేగుల లోపలి గోడ దెబ్బతినకుండా కాపాడతాయి. అందువల్ల ఆహారంలో తగినంత పీచు పదార్థం ఉండేలా చూసుకోవటం చాలా ముఖ్యం. లేకపోతే బ్యాక్టీరియా ఆహారం కోసం పేగు మీదే ఆధారపడుతుంది. అప్పుడు మొదటికే మోసం వస్తుంది.



# మెదడుకు ‘సి’ రక్ష

విటమిన్ సి అనగానే రోగనిరోధక వ్యవస్థ బలోపేతమే గుర్తుకొస్తుంది. ఇది మెదడు ఆరోగ్యంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నట్టు తాజాగా బయటపడింది. విటమిన్ సి తక్కువగా గల వృద్ధుల మెదడులో విషయగ్రహణ క్షీణతతో ముడిపడిన మార్పులు కనిపిస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. జ్ఞాపకశక్తి వంటి అంతర్గత ఆలోచనా ప్రక్రియలో మెదడులోని ఆయా భాగాలను అనుసంధానించే డిఫాల్ట్ మోడ్ నెట్‌వర్క్ (డీఎంఎన్) పాలు పంచుకుంటుంది. ఇది క్షీణిస్తే విషయగ్రహణ లోపం.. అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి జబ్బుల ముప్పు పెరుగుతుంది. విటమిన్ సి మోతాదులు తక్కువగా ఉండే వృద్ధుల్లో మెదడులోని బూడిద రంగు భాగం, డీఎంఎన్ అనుసంధాన సామర్థ్యం తగ్గుతున్నట్టు పరిశోధకులు గమనించారు. జబ్బులకూ వీటికీ స్పష్టమైన సంబంధం కనిపిస్తుండటం గమనార్హం. విటమిన్ సి శరీరమంతటా యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. వాపుప్రక్రియకు కారణమయ్యే విశృంఖల కణాలను నిర్వీర్యం చేయటంలో సాయపడుతుంది. ఇదే మెదడుకు రక్షణగా నిలుస్తుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

# చియా మేలయా

చియా గింజల్లో ఆల్ఫా-లినోలిక్ యాసిడ్ అనే ఒమేగా 3 కొవ్వు ఆమ్లం దండిగా ఉంటుంది. ఇవి ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలతో పోలిస్తే ఒమేగా 6 కొవ్వు ఆమ్లాల నిష్పత్తి తగ్గటానికీ తోడ్పడతాయి. ఈ నిష్పత్తి తక్కువగా ఉండటానికీ గుండెజబ్బు, క్యాన్సర్ వంటి దీర్ఘకాల సమస్యల ముప్పు తగ్గటానికీ సంబంధం ఉంటుండటం విశేషం. వీటిల్లోని క్వెర్‌సెటిన్ అనే యాంటీఆక్సిడెంట్ సైతం గుండెజబ్బుల వంటి పలు సమస్యల ముప్పును తగ్గిస్తుంది. చియా గింజలతో క్యాల్షియం, మాంగనీస్, మెగ్నీషియం, సెలీనియం, రాగి, ఐరన్, ఫాస్ఫరస్ వంటి పోషకాలూ లభిస్తాయి.



# ఇంటి తిండితో జ్ఞాపకశక్తి



బయటి తిండి కన్నా ఇంట్లో వండుకునే ఆహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీంతో మధుమేహం, ఊబకాయం, గుండెజబ్బుల వంటి సమస్యల ముప్పు తగ్గుతున్నట్టు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది తీవ్ర మతిమరుపును తెచ్చిపెట్టే డిమెన్షియా బారినపడటాన్నీ తగ్గిస్తున్నట్టు తాజాగా బయటపడింది. జపాన్ జెరంటాలజీ ఎవాల్యుయేషన్ అధ్యయనంలో పాల్గొన్న 11వేల మంది వృద్ధుల ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించి మరీ ఈ విషయాన్ని గుర్తించారు. డిమెన్షియా నివారణలో జీవనశైలి మార్పులు కీలక పాత్ర పోషిస్తున్నట్టు ఫలితాలు సూచిస్తున్నాయని పరిశోధకులు పేర్కొంటున్నారు. ఆహారం, శారీరక శ్రమ వంటి జీవనశైలి అంశాలను మార్చుకోవటం ద్వారా డిమెన్షియా కేసులు సుమారు 40% వరకూ తగ్గుతున్నట్టు 2020 లాన్సెట్ కమిషన్ రిపోర్టులో వెల్లడైన విషయాన్ని ఈ సందర్భంగా ఉటంకిస్తున్నారు. ఇంతకీ ఇంటి వంట విషయ గ్రహణ సామర్థ్యం పెరగటానికి ఎలా తోడ్పడుతుంది?

ఇంట్లో వండుకోవటం ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను ప్రోత్సహిస్తుంది. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినేలా, అతిగా శుద్ధి చేసిన పదార్థాలు తగ్గించుకునేలా చేస్తుంది.

వంట వండుకోవటానికి పడే శ్రమ కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. పప్పులు, బియ్యం, కూరగాయల వంటివి కొనుక్కొని రావటానికి బయటకు వెళ్లి నాలుగడుగులు వేయాల్సిందే. వండుకోవటానికి వాటిని సిద్ధం చేయటం.. అంటే కడగటం, తొక్క తీయటం వంటి పనులు చిన్నవైనా వృద్ధులకు ఎంతో కొంత శారీరక శ్రమను కలిగిస్తాయి.

వండటం తేలికైన పనేమీ కాదు. ఇందుకోసం మెదడు చురుకుగా పనిచేయాల్సి ఉంటుంది కూడా. ఏం వండాలి? ఏయే పదార్థాలు ఎంతెంత అవసరం? ఎంత మందికి వండాలి? అనేవి నిర్ణయించుకోవటానికి ఆలోచించక తప్పదు. ఆయా వంటకాలను చేసే తీరును తిరిగి గుర్తుకు తెచ్చుకొని, రుచికరంగా వండుకోవాల్సి ఉంటుంది కూడా. ఇవన్నీ మెదడుకు పని చెప్పేవే.

# పోషక మాత్రలు సరిగా..



ప్రస్తుత కాలంలో విటమిన్ సి, విటమిన్ డి, విటమిన్ బి12, ఐరన్, క్యాల్షియం వంటి పోషకాల మాత్రలను తీసుకోనివారు లేరంటే అతిశయోక్తి కాదేమో. ఆరోగ్యం మెరుగవుతుందనో, రోగనిరోధక శక్తి పెరుగుతుందనో చాలామంది తమకు తామే రోజూ వేసుకోవటం చూస్తూనే ఉంటాం. సమతులాహారం తీసుకునే ఆరోగ్యవంతులకు సాధారణంగా ప్రత్యేకించి అదనంగా పోషకాలను తీసుకోవాల్సిన అవసరమేమీ లేదు. విటమిన్లు, ఖనిజ లవణాల లోపం లేనివారికి వీటితో పెద్దగా ఉపయోగమేమీ ఉండదు. గుండెజబ్బులు, క్యాన్సర్ల ముప్పేమీ తగ్గదు. ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు రక్తంలో ట్రైగ్లిజరైడ్ల మోతాదులు తగ్గటానికి తోడ్పడతాయని అధ్యయనాలు చెబుతున్నప్పటికీ ఈ మాత్రలతో గుండెజబ్బుల ముప్పు తగ్గుతున్నట్టు స్పష్టంగా బయటపడలేదు. సమతులాహారానికి పోషక మాత్రలు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదని గుర్తించాలి. అయితే పోషకాల లోపం గలవారికి వీటిని అదనంగా తీసుకోవటం ఎంతో మేలు చేస్తుంది. ఈ పోషక మాత్రలను సొంతంగా కొనుక్కునే అవకాశం ఉన్నప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ డాక్టర్ సిఫారసు లేకుండా తీసుకోవద్దు. ఇవి అవసరమైతే ఎప్పుడెలా వేసుకోవాలో తెలుసుకొని ఉండటమూ తప్పనిసరి.

కాస్త ఆరోగ్యకరమైన కొవ్వుతో కూడిన ఆహారంతో పాటు విటమిన్ డి తీసుకుంటే శరీరం బాగా శోషించుకుంటుంది.

ఐరన్‌ను పరగడుపున తీసుకోవటం మంచిది. ఒకవేళ కడుపులో తిప్పటం, వికారంగా అనిపిస్తే భోజనంతో పాటు వేసుకోవచ్చు. విటమిన్ సి లభించే పదార్థాలతో ఐరన్ తీసుకుంటే శరీరం ఇంకా బాగా గ్రహించుకుంటుంది. అయితే ఐరన్, క్యాల్షియం రెండింటికీ పొసగదు. కాబట్టి టీ, కాఫీ, పాలు, క్యాల్షియం మాత్రలతో కలిపి ఐరన్ తీసుకోవద్దు.


క్యాల్షియంను ఒకేసారి పెద్ద మోతాదు కన్నా తక్కువ మోతాదుల్లో తీసుకుంటే మేలు.

విటమిన్ డి కావచ్చు, ఇతర పోషకాలు కావచ్చు. ఏవైనా గానీ డాక్టర్ సిఫారసు చేసిన మోతాదుల్లోనే తీసుకోవాలి. మరీ ఎక్కువ మోతాదుల్లో వేసుకుంటే హాని కలిగిస్తాయి.

రకరకాల మాత్రలు వేసుకునేటప్పుడు కొన్నిసార్లు అవే పోషకాలు ఇతర మాత్రల్లోనూ ఉండొచ్చు. దీన్ని గమనించకపోతే మోతాదు పెరిగిపోయే ప్రమాదమూ ఉంది.

ఏళ్లకేళ్లు వద్దు

కొందరు పోషకాల మాత్రలను ఒకసారి మొదలెడితే ఏళ్ల కొద్దీ అలాగే కొనసాగిస్తుంటారు. అందరికీ జీవితాంతం వీటి అవసరముండదు. ఆయా పోషకాల లోపం తగ్గేంతవరకే తీసుకోవాలి. అయితే పోషకాలను గ్రహించుకోవటంలో శరీరానికి ఇబ్బంది కలిగితే సీలియాక్ జబ్బు, పేగుపూత వంటి జబ్బులు గలవారికి.. కొన్నిరకాల జీర్ణకోశ చికిత్సలు చేయించుకున్నవారికి, మధుమేహం వంటి జబ్బులకు మందులు వేసుకునేవారికి దీర్ఘకాలం అదనపు పోషకాలు అవసరం. అయినా కూడా డాక్టర్ పర్యవేక్షణ తప్పనిసరి. మోతాదులు సరిపోతున్నాయో లేదో తెలుసుకోవటానికి, మరీ ఎక్కువ కాకుండా చూసుకోవటానికి అప్పుడప్పుడు రక్త పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.



# ఈసారి వినాయకచవితి ఎప్పుడంటే? సెప్టెంబరులో వచ్చే పర్వదినాలివే!

భాద్రపద మాసంలో వచ్చే సెప్టెంబరు నెలలో అనేక పర్వదినాలు, వ్రతాలు, పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోడానికి అవకాశం కలుగుతుంది. వినాయక నవరాత్రులు, శ్రీకృష్ణ జన్మాష్టమి, ఏకాదశి, ప్రదోషం, మాసశివరాత్రి, అమావాస్య, పూర్ణిమతో పాటు మహాలయ పక్ష ప్రారంభం ఈ నెల ప్రత్యేకతలు.

సెప్టెంబరు 4 – శ్రీకృష్ణ జన్మాష్టమి: శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీకృష్ణుని జన్మదినాన్ని భక్తులు ఉపవాస దీక్షలతో, భజనలు, కీర్తనలు, పూజలతో వైభవంగా నిర్వహిస్తారు. అర్ధరాత్రి సమయంలో శ్రీకృష్ణ జన్మాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ.

సెప్టెంబరు 8 – ప్రదోష వ్రతం: మంగళవారం ప్రదోష వ్రతం. శివభక్తులు ప్రదోష కాలంలో పరమశివుడిని అభిషేకాలు, బిల్వార్చనలు, దీపారాధనలతో పూజిస్తారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి.

సెప్టెంబరు 9 – మాస శివరాత్రి: శివనామస్మరణ, అభిషేకం, బిల్వదళ సమర్పణ, ఉపవాసం వంటి ఆచారాలతో భక్తులు ఈ పర్వదినాన్ని జరుపుకొంటారు.

సెప్టెంబరు 11 – పోలాల అమావాస్య: గ్రామీణ ప్రాంతాల్లో ఈ పర్వదినానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. కుటుంబ సౌభాగ్యం, సంతాన క్షేమం, పంటల అభివృద్ధి కోసం సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తారు. అదే రోజు ఉదయం 8.57 గంటలకు అమావాస్య తిథి ప్రారంభమవుతుంది.

సెప్టెంబరు 14 – వరసిద్ధి వినాయక వ్రతం: సోమవారం శ్రీ




వరసిద్ధి వినాయక వ్రతం. (+ఖఅవంష్ట్ర జష్ట్రఘ్బతీష్ట్రఱ 2026) వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన గణపతి పూజలకు ఈ రోజు విశేష ప్రాధాన్యం ఉంటుంది. ఇదే రోజు రవి ఉత్తర ఫల్గుణి నక్షత్రంలోని మొదటి పాదంలోకి మధ్యాహ్నం 12.53 గంటలకు ప్రవేశిస్తాడు. శ్రీ మహాగణపతి వాక్యార్థ సభ కూడా ప్రారంభమవుతుంది.

సెప్టెంబరు 20 – శ్రీ కేదారేశ్వర వ్రతం: ఆదివారం శ్రీ కేదారేశ్వర వ్రతం. పరమశివుడైన కేదారేశ్వరుని ఆరాధిస్తూ భక్తులు వ్రతాన్ని ఆచరిస్తారు. కుటుంబ సౌఖ్యం, శ్రేయస్సు కోసం ఈ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.

సెప్టెంబరు 22 – పరివర్తినీ ఏకాదశి, వామన జయంతి: మంగళవారం పరివర్తినీ ఏకాదశి, వామన జయంతి. శ్రీమహావిష్ణువు వామన అవతారాన్ని స్మరించుకునే ఈ రోజు (ఝఖఝిఅఖ యిఖిఝత్‌ఱ ఞ్వ 2026) వైష్ణవ సంప్రదాయంలో విశేషమైనది. ఏకాదశి వ్రతాన్ని భక్తులు నియమనిష్ఠలతో ఆచరిస్తారు.

సెప్టెంబరు 25 – గణపతి నిమజ్జనం, అనంతపద్మనాభ స్వామి వ్రతం: శుక్రవారం గణపతి నిమజ్జనం జరుగుతుంది. వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాలకు పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో నిమజ్జనం (స్త్రుఖఅవంష్ట్ర అఱఝిఖయిఖిఅఖఎ 2026) చేస్తారు. అదే రోజు శ్రీ అనంతపద్మనాభ స్వామి వ్రతం. (ఖఅఖిత్‌ష్ట్రుఖ జూఖఎఝి ంఖఎఎ జతీఫ్‌ష్ట్రుఎ) శ్రీమహావిష్ణువును అనంతపద్మనాభ స్వరూపంలో ఆరాధిస్తూ భక్తులు వ్రతాన్ని నిర్వహిస్తారు.

సెప్టెంబరు 26 – పూర్ణిమ, ఉమామహేశ్వర వ్రతం: శనివారం పూర్ణిమ. ఈ రోజు శ్రీ ఉమామహేశ్వర వ్రతం, చాతుర్మాస వ్రత సమావేశాలు నిర్వహిస్తారు. పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, దీపారాధనలు జరుగుతాయి.

సెప్టెంబరు 27 – మహాలయ పక్షం ప్రారంభం: ఆదివారం మహాలయ పక్షం ప్రారంభమవుతుంది. పితృదేవతలను స్మరించుకునే ఈ కాలానికి హిందూ సంప్రదాయంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. (మీఖష్ట్రుశ్రీఖఝి ాఖఎంష్ట్రు 2026) పితృ తర్పణాలు, శ్రాద్ధకర్మలు, దానధర్మాలు వంటి ఆచారాలను కుటుంబ సంప్రదాయాల ప్రకారం నిర్వహిస్తారు.

సెప్టెంబరు 28, 29 – మహాగణపతి సభ, సంకటహర చతుర్థి: సోమవారం శ్రీ మహాగణపతి వాక్యార్థ సభ పూర్తవుతుంది. సెప్టెంబరు 29న మంగళవారం తదియ, సంకటహర చతుర్థి, బృహత్యమావ్రతం వంటి పర్వదినాలు ఉన్నాయి. గణపతిని ఆరాధిస్తూ సంకటాలను తొలగించాలని, కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని భక్తులు ప్రార్థిస్తారు.

# స్ఫూర్తి మంత్రం.. అభివృద్ధి పథం

ఒక లక్ష్యం... దాన్ని నెరవేర్చుకోవాలన్న బలమైన సంకల్పం... ఇవే తేజస్విని హెబాల్కర్‌ను నేడు ప్రత్యేకంగా నిలబెట్టాయి. ఇంజినీరింగ్ చదివే రోజుల్లో చిప్స్ తయారీ రంగంలో స్థిరపడాలని అనుకున్నారు. కానీ అనూహ్యంగా నెట్‌వర్కింగ్ వైపు ఆకర్షితులయ్యారు. ఇంటర్నెట్, డాట్‌కామ్‌ల విప్లవం ప్రారంభమైన రోజుల్లో కంప్యూటర్లతో దోస్తీ మొదలుపెట్టిన ఆమె... ఇప్పుడు అమెరికాలోని అతిపెద్ద ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఒకటైన 'ఆల్‌స్టేట్స్'లో కీలక పదవిని అలంకరించారు. ఏఐ యుగంలోనూ పోటీపడుతూ మహిళలకు స్ఫూర్తిమంత్రమయ్యారు.



"విచిత్రమైన ప్రయాణం నాది. పుట్టింది, పెరిగిందంతా ముంబయిలోనే. కానీ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాను. చదువు అవ్వగానే అక్కడే కొలువు. చివరకు అమెరికా నా గమ్యస్థానం అయింది. విశేషమేంటంటే మా అమ్మానాన్న కూడా యూఎ?సలోనే చదువుకున్నారు. నేను మొదటి నుంచీ చదువులో టాప్‌లో ఉండేదాన్ని. ముఖ్యంగా గణితం, సైన్స్‌పై మక్కువ ఎక్కువ. అమెరికాలోని 'కార్నేజి మెలాన్ యూనివర్సిటీ'లో ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ చదివాను. అదే విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ కూడా పూర్తి చేశాను. బీటెక్ చదివే రోజుల్లో చిప్ తయారీ రంగంలో స్థిరపడాలని అనుకున్నాను. ఎంఎ?సకు వెళ్లేసరికి నెట్‌వర్కింగ్ మీదకు మనసు మళ్లింది. ఎందుకంటే అది 1990ల కాలం. అప్పుడే ఇంటర్నెట్, డాట్‌కామ్ విప్లవం మొదలైంది. వేగవంతమైన నెట్‌వర్క్‌లు అతిపెద్ద ఆవిష్కరణలుగా ఆవిర్భవిస్తున్న కాలం. వీటన్నిటి నేపథ్యంలో ఏఎండీ, డెల్‌లలో ఇంటర్న్‌షిప్ తరువాత 2001లో నోకియాలో మేనేజర్‌గా మూడేళ్లు పని చేశాను. అక్కడి నుంచి ఇన్ఫోసిస్, సిస్కోల్లో రెండేళ్లు వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించాను. ప్రముఖ గ్లోబల్ సేల్స్ అండ్ మార్కెటింగ్ కన్సల్టెన్సీ జెడ్‌ఎ?సలో ఎనిమిదేళ్లు వెస్ట్ రీజియన్ లీడ్‌గా సేవలు అందించాను. మార్కెట్ వ్యూహాలు, వాణిజ్యపరమైన ఆవిష్కరణలు, కస్టమర్ సపోర్ట్ లాంటి విభిన్న విభాగాలను సమన్వయం చేసుకొంటూ కంపెనీని అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత నాది.

**అందుకే ఎంబీయే...**

నోకియాలో పని చేసే సమయంలో పెద్ద రౌటర్లు, స్విచ్‌లను తయారు చేసేవాళ్లం. వాటిలో నూతన ఆవిష్కరణలకు ప్రయత్నించే క్రమంలో నాకు వ్యాపారపరమైన అంశాలపై ఆసక్తి కలిగింది. దాంతో కొన్నేళ్లు నా కెరీర్ టెక్ ప్రపంచం, వ్యాపార కార్యకలాపాల మధ్య సాగింది. ఇదే క్రమంలో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొనేందుకు ఎంఐటీ స్లోన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీయే చేశాను. తరువాత స్కేర్ ట్రేడ్‌లో చీఫ్ సర్వీస్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టాను. అందులో పదేళ్లకు పైగా పని చేశాను. ఆ సమయంలోనే 'ఆల్‌స్టేట్ ఇన్సూరెన్స్ కంపెనీ' స్క్వేర్ ట్రేడ్‌ను కొనుగోలు చేసింది. నా కెరీర్‌ను మలుపు తిప్పిన సందర్భం అది. 'ఆల్‌స్టేట్' అమెరికాలోని అతిపెద్ద పబ్లిక్ ఇన్సూరెన్స్ ప్రొవైడర్లలో ఒకటి. భారత్‌లోని బెంగళూరు, పుణేల్లో దీని కేంద్రాలు ఉన్నాయి. ఆ సంస్థకు ఆపరేషన్స్, ప్రాపర్టీ లయబిలిటీ డిజిటల్ ప్రాసెస్ ట్రాన్సర్మేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఎస్‌వీపీ)గా వ్యవహరిస్తున్నాను. అలాగే ఇండియా విభాగానికి ప్రెసిడెంట్‌గా ఉన్నాను. కంపెనీలో ఏడు వేలమందికి పైగా పని చేస్తున్నారు.

**విభిన్నమైన పాత్ర...**

ఏడాదిన్నరగా 'ఆల్‌స్టేట్'లో పని చేసే క్రమంలో ఒక విభిన్నమైన పాత్రలోకి మారాను. కస్టమర్ సర్వీస్, బ్యాక్ ఆఫీస్, క్యాపబిలిటీ ఆపరేషన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ చూసుకొంటున్నాను. ఏఐ విప్లవాన్ని అందిపుచ్చుకొని, అధునాత సాంకేతికతో ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాను. నేను టెక్ రంగంలోకి అడుగుపెట్టే సమయంలో మహిళలు చాలా అరుదుగా కనిపించేవారు. అడ్డంకులు, పరిమితులు సవాళ్లు విసురుతుంటే, అన్నింటినీ ఛేదించుకొంటూ ముందుకు సాగాను. నాలాగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని అనుకొనే మహిళలకు అండగా నిలుస్తున్నాను. వారి కోసం అవకాశాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాను. అంతిమంగా మహిళల సంఖ్యను పెంచేందుకు నా వంతు కృషి చేశాను. మా సంస్థలో కూడా అమ్మాయిలకు అనువైన వాతావరణం కల్పించడానికి, ప్రసూతి సమయంలో సహకారం అందించడానికి 'ఆల్ మామా' అనే కార్యక్రమం ప్రారంభించాను. ఇలాంటివి ఇంకా ఎన్నో తీసుకువచ్చాను.

**సహానుభూతి అవసరం...**

ప్రస్తుతం ఏఐ విప్లవం నడుస్తోంది. ఏఐ సాధనాల ద్వారా సాంకేతిక నైపుణ్యాలు అందరికీ అందుబాటులోకి వస్తున్నాయి. అదే సమయంలో సహానుభూతి కూడా ఉండాలి. ఏఐ విశ్లేషణాత్మకమైన, సవాళ్లతో కూడిన కోడింగ్ తదితర క్లిష్టమైన పనులను కూడా చేయగలదు. కానీ మానవ సంబంధాలను నెరపలేదు. మనం నిర్మించుకొనే సంబంధాలు, సహానుభూతి అత్యంత ముఖ్యమైనవనేది నా భావన. ఇక నా ఈ సుదీర్ఘ ప్రయాణంలో సాధించిన విజయాలంటే... నేను ప్రభావితం చేసిన వ్యక్తుల సంఖ్యేనని చెబుతాను. ఒక టీమ్ లీడర్‌గా విజయం సాధిస్తే, అది నాకే కాదు, నన్ను నమ్ముకున్న సంస్థకు కూడా మేలు చేస్తుంది. కొత్త సామర్థ్యాలను గుర్తించి, అత్యుత్తమ పనితీరు కనబరిచే బృందాలను నిర్మించడంపైనే ఒక లీడర్ గెలుపు ఆధారపడి ఉంటుంది. అంతేకాదు... ప్రతిఒక్క టీమ్‌లోని ప్రతిఒక్క సభ్యుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించి, లీడర్లుగా తీర్చిదిద్దగలిగితే అప్పుడే అసలైన విజయం సిద్ధించినట్టు."

# బస్తర్ బాటలో బడి దీదీ'

ఛత్తీస్‌గఢ్ బస్తర్ జిల్లాలోని దట్టమైన అడవుల్లో నాలుగు దశాబ్దాలకు పైగా నిరంతరం పర్యటిస్తూ, గిరిజన బాలికల విద్య, మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నారు డాక్టర్ బుద్రి తాటి. అక్కడి ప్రజలు ఆప్యాయంగా 'బడి దీదీ' అని పిలుచుకునే ఆమె సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం 2026లో 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించింది. ఈ సందర్భంగా ఆమె సాగించిన సుదీర్ఘ పోరాట ప్రస్థానం ఆమె మాటల్లోనే...

"నా జీవిత ప్రస్థానం సునాయాసంగా ఏమీ సాగలేదు. నేను సెప్టెంబర్ 15, 1966లో బస్తర్ జిల్లా దంతెవాడలోని హిరనార్ అనే ఒక నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించాను. రోడ్డు సదుపాయాలు, విద్యుత్ వెలుగులు, కనీస వైద్య సదుపాయాలు లేని ఆ దండకారణ్య లోయల్లోనే నా బాల్యం గడిచింది. ఆరేళ్ల వయసులోనే నన్ను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు. అక్కడ పదో తరగతి వరకు చదువుకున్నాను. ఆ సమయంలో, సమాజంలో గిరిజనులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులను, అక్షరాస్యత లేకపోవడం వల్ల జరుగుతున్న దోపిడీని కళ్లారా చూశాను. ఆ అనుభవాలే నా హృదయంలో సేవా నిరతిని రగిలించాయి. కేవలం పదిహేనేళ్ల ప్రాయంలోనే సామాజిక సేవ వైపు అడుగులు వేశాను. ఆ తర్వాత జనవరి 1984లో అఖిల భారత వనవాసి కళ్యాణ ఆశ్రమ్‌లో చేరి నా జీవితాన్ని పూర్తిగా గిరిజన సమాజ శ్రేయస్సుకే అంకితం చేయాలని నిర్ణయించుకున్నాను.

**ధైర్యంగా తొలి అడుగులు**

1980వ దశకంలో బస్తర్ ప్రాంతంలో పరిస్థితులు అత్యంత భయంకరంగా ఉండేవి. తీవ్రమైన అంతర్గత సంక్షోభం, భౌగోళిక ప్రయాసల వల్ల ప్రభుత్వ యంత్రాంగం కానీ, ఇతర స్వచ్ఛంద సంస్థలు కానీ లోపలి గ్రామాల్లోకి వెళ్లడానికి వెనకాడుతుండేవి. అటువంటి సమయంలో నేను ఒక భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నాను. 1986 నుండి బస్తర్‌లోని





దట్టమైన అటవీ ప్రాంతాలలో ఒంటరిగా, కాలినడకన పర్యటించడం ప్రారంభించాను.

రహదారులు లేని, కాలినడకన మాత్రమే వెళ్లగలిగే 570కి పైగా సుదూర గిరిజన గ్రామాలను నేను అంగుళం అంగుళం చుట్టివచ్చాను. అధికారులు లేదా స్వచ్ఛంద సంస్థల సహాయం కోసం ఎదురుచూడకుండా, నేనే స్వయంగా గిరిజనుల గుడారాల తలుపు తట్టి వారి కుటుంబాల్లో ఒకరిగా కలిసిపోయాను.

**వసతి గృహాల నిర్మాణం**

మా గిరిజన ప్రాంతాల్లో బాలికలకు చదువు చెప్పించడం అనేది ఒక అసాధ్యమైన స్వప్నంలా ఉండేది. సుదూర ప్రాంతాల్లో పాఠశాలలు ఉండటం, పేదరికం, ఆడపిల్లలను ఇంటి పనులకే పరిమితం చేసే సామాజిక అపోహలు బాలికల విద్యకు పెద్ద అడ్డంకిగా మారాయి. నేను ప్రతి గూడేనికి వెళ్లి తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించేదాన్ని. అయితే, కేవలం మాటలతో అవగాహన కల్పిస్తే సరిపోదని, పిల్లలు చదువుకోవడానికి తగిన నివాస వసతి కల్పించాలని గ్రహించాను. ఆ ఆలోచన నుంచే గిరిజన బాలికల కోసం ఆశ్రమ వసతి గృహాలకు పునాది పడింది. 1990లో బార్సూర్‌లో కేవలం 11 మంది గిరిజన బాలికలతో మొదటి ఆశ్రమ వసతి గృహాన్ని ప్రారంభించాను. ఆ తర్వాతి కాలంలో అనేక శ్రమలకోర్చి హౌరనార్‌లో ఉచిత వసతి గృహాన్ని నిర్మించాను. ప్రస్తుతం ఈ హాస్టల్‌లో 50 మంది గిరిజన బాలికలు ఉచితంగా నివసిస్తూ విద్యనభ్యసిస్తున్నారు. తమ కుటుంబాలలోనే మొట్టమొదటితరం అక్షరాస్యులుగా నిలిచిన ఈ పిల్లలను చూస్తుంటే నా శ్రమను మరచిపోతాను.

**సమగ్ర సమాజ వికాసం**

నా సేవలు కేవలం అక్షరాస్యతకే పరిమితం కాలేదు. గిరిజన మహిళల్లో ఆరోగ్య స్పృహ పెంచడం, మాతాశిశు మరణాలను అరికట్టడం కోసం నేను విస్తృతంగా ప్రచారం చేశాను. గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం, పరిశుభ్రతపై అక్కడి మహిళలకు నిరంతరం అవగాహన కల్పించాను. దీనికి తోడు, గిరిజన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాను. చేతివృత్తులు, చిన్నపాటి స్వయం ఉపాధి శిక్షణల ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాను. సమస్యాత్మక ప్రాంతాల్లో పనిచేస్తున్నప్పుడు అనేక రకాల ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదురైనప్పటికీ ఏనాడూ నా సంకల్పాన్ని వీడలేదు.

**పద్మశ్రీ పురస్కారం**

నాలుగు దశాబ్దాలకు పైగా ప్రచార ఆర్భాటాలు లేకుండా నిశ్శబ్దంగా నేను చేసిన సేవలకు భారత ప్రభుత్వం అత్యున్నత గుర్తింపునిచ్చింది. ఈ ఏడాది మే 25న న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నాను. ఈ గౌరవం కేవలం నాకు దక్కింది కాదు, దండకారణ్యంలో మార్పు కోసం నిరంతరం తపించే ప్రతి ఒక్కరిదీ. మార్పు అనేది సుదీర్ఘ ఉపన్యాసాలలో కాకుండా నిరంతర శ్రమలోనే ఉంటుందని నేను బలంగా నమ్ముతాను. నా చివరి శ్వాస వరకు బస్తర్ గిరిజనుల బాగుకోసమే నా జీవితం అంకితం"

# నవగ్రహ దోషాలు.. ఏ రోజు ఏయే పండ్లు దానం చేస్తే మంచిది?





జ్యోతిష శాస్త్రం పరంగా నవగ్రహ దోష నివారణకు ఫలదానం విశేషంగా ఫలితాన్ని ఇస్తుంది. ఈ దోషాల నివృత్తికి, నవగ్రహాలను ప్రసన్నం చేసుకొనేందుకు ఏయే ఫలాలు దానంగా ఇస్తే మంచిదో, 'బృహన్నారదీయం'లో వివరించారు. మరి నవగ్రహ దోష నివారణకు ఫలదానం ఎంత మేలు చేస్తుందో చూద్దాం.

సూర్యాయ మాతులుంగంచ చంద్రాయ కదళీఫలం
కుజాయ దాడిమీ ఫలం బుధాయ ఆమ్రఫలం తథా
గురవే పనసంచైవ శుక్రాయ ఖర్జూరకం తథా
శనయే జంబూ ఫలంచైవ రాఘవే నారికేళకం
కేతవే మాతులింగంచ ఫలన్యేతాని కల్పయేత్

పై శ్లోకం ప్రకారం.. నవ గ్రహాల్లో సూర్యుడి అనుగ్రహం పొందాలంటే మాతులుంగ ఫలం (జంబీర ఫలం లేదా పెద్ద నిమ్మ/దబ్బ పండు) దానంగా ఇవ్వాలి.

చంద్రగ్రహ దోష నివారణకు కదళీ ఫలం (అరటి పండ్లు) ఎవరికైనా సోమవారం దానంగా ఇస్తే మంచిది.

ఎవరి జాతకంలోనైనా కుజ దోషం ఉంటే వారు దాడిమీ ఫలం (దానిమ్మ పండు) మంగళవారం దానంగా ఇవ్వాలి. తద్వారా కుజ దోష తీవ్రత తగ్గుతుంది.

జాతకంలో బుధుడు దోషయుక్తమై విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ప్రతికూల ఫలితాలు వస్తున్నట్లయితే.. బుధవారం మామిడి పండ్లను ఎవరికైనా దానమివ్వాలి.

జాతకంలో గురు బలం తక్కువగా ఉండి, వివాహ సంబంధమైన సమస్యలు వస్తుంటే.. వాటిని తొలగించేందుకు గురువారం తాంబూలంలో పనస పండు ఉంచి దానంగా ఇవ్వాలి.

శుక్ర గ్రహ దోషాలు తొలగేందుకు శుక్రవారం ఖర్జూర పండ్లను తాంబూలంలో ఉంచి దానంగా ఇస్తే శుభఫలితాలు ఉంటాయి. అలాంటి వారికి కళారంగంలోనూ పురోభివృద్ధి ఉంటుంది.

ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమశని, కంఠక శని, సప్తమ శని, వ్యయ శని.. ఇలా గోచారపరంగా శని గ్రహ దోషాలతో ఇబ్బందులు పడుతున్నవారైతే శనివారం జంబూ ఫలం (నేరేడు పండ్లు) దానమిస్తే మంచిది.

రాహు గ్రహ దోష ప్రభావంతో విదేశీ యానం ప్రయత్నాలు ఆలస్యమవడం, విదేశాలకు వెళ్లాలనే కల నెరవేరడంలో జాప్యం, స్నేహితులతో ఇబ్బందులు ఎదురవ్వడం, అనారోగ్య భావనలతో సతమతమయ్యేవారు రాహువుకు ప్రియమైన వారమైన శనివారం రోజు కొబ్బరికాయ (నారికేళం) దానంగా ఇవ్వాలి.

జాతకంలో కేతుగ్రహ దోషాలుంటే.. ఆకస్మికంగా, హఠాత్తుగా రకరకాల సమస్యలు కనబడుతుంటాయి. వాటిని తొలగించుకొనేందుకు కేతువుకు ప్రియమైన వారమైన మంగళవారం మాతులుంగ ఫలం (పెద్ద నిమ్మ/దబ్బ పండు) దానంగా ఇవ్వడం వల్ల కేతు గ్రహ దోషాల నుంచి ఉపశమనం పొందొచ్చు.

నవగ్రహ ప్రదక్షిణలు ఎలా చేయాలి? ఏయే శ్లోకాలు పఠించాలి?

ఇలా బృహన్నారదీయంలో పేర్కొన్న విధంగా ఒక్కో గ్రహ దోషాన్ని తగ్గించుకునేందుకు ఒక్కో రకమైన ఫలాన్ని దానంగా ఇస్తే.. సమస్త శుభఫలితాలు చేకూరతాయి. అలాగే, పాప గ్రహాల వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు.. వాటిని తొలగించుకొనేందుకు మాతులుంగ ఫలదానం విశేష ఫలితాలనిస్తుంది.

# మజ్జిగ తాగుదాం...



వర్షాకాలంలో తేమ వాతావరణం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. అలాంటప్పుడు ఓ కప్పు పెరుగుకి మూడు కప్పుల మంచినీటిని కలిపి తాగితే జీర్ణక్రియ వేగవంతమవుతుంది. మజ్జిగలో ఉండే లాక్టోబాసిల్లస్ బ్యాక్టీరియా.. కడుపులో మంట, అజీర్తి, పొట్ట ఉబ్బరం లాంటి సమస్యలను నివారిస్తుంది.

రోజూ ఓ గ్లాసు మజ్జిగ తాగితే వర్షాకాలంలో తరచూ ఎదురయ్యే వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి ఉపశమనం లభిస్తుంది. మజ్జిగలోని బి విటమిన్, క్యాల్షియం తదితర పోషకాలు శరీరానికి తక్షణ శక్తిని చేకూరుస్తాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

సాధారణంగా వర్షాకాలంలో అంతగా మంచినీటిని తాగకపోవడం వల్ల శరీరంలో ఎలకో?ట్రలైట్ల సమతుల్యత దెబ్బతిని నీరసం రావచ్చు. అలాంటప్పుడు మజ్జిగ తాగితే శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. చెడు కొలెస్ట్రాల్ స్థాయి తగ్గుతుంది. రక్తపోటు అదుపులో ఉంటుంది.

ర్షాకాలంలో మజ్జిగను ఉదయం లేదా మధ్యాహ్న సమయాల్లో మాత్రమే తాగాలి. రాత్రి పడుకునేముందు తాగకూడదు. మజ్జిగలో చల్లటి నీళ్లు లేదంటే ఐస్ క్యూబ్స్ కలపకూడదు. గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న తాజా మజ్జిగను మాత్రమే తీసుకోవాలి.

పలుచటి మజ్జిగలో కొద్దిగా జీలకర్ర పొడి, చిటికెడు నల్ల ఉప్పు, కొద్దిగా అల్లం తురుం, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి కలిపితే దానిలోని చలువ చేసే గుణాలు సమతుల్యమవుతాయి. కాబట్టి వర్షాకాలంలో మజ్జిగ తాగినా జలుబు, దగ్గు, గొంతు నొప్పి, తుమ్ముల లాంటి సమస్యలు రావు.

తెలంగాణ ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక



# కళాకారులు మనస్ఫూర్తిగా అందించిన సత్కారం జీవితంలో మరువలేనిది





**ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవ వేడుకలలో పద్మశ్రీ మురళీ మోహన్**

**హైదరాబాద్, రవీంద్ర భారతి ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**
జానపద కళాకారులు మనస్ఫూర్తిగా అందించిన సత్కారం తన జీవితంలో మర్చిపోలేనిదని ప్రముఖ సినీ నటుడు ,పద్మశ్రీ' పురస్కార గ్రహీత
డా. మాగంటి మురళీమోహన్ అన్నారు. ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'సాంస్కృతికబంధు' సా?పల్లి కొండలరావు సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం, యువ కళావాహిని సంయుక్త ఆధ్వర్యంలో "ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం" అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మురళీమోహన్ పాల్గొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణ చారితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాకారులు ఏ పని చేసినా మనసుతో చేస్తారని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం మారుమున ఉన్న జానపద కళాకారులను గుర్తించి పద్మశ్రీ అవార్డులను ఇవ్వడం విశేషమన్నారు. డాక్టర్ కేవీ రమణ చారి అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. సారిపల్లి కొండలరావు సారధ్యంలో జానపద కళాకారులకు ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. భారత ప్రభుత్వం మురళీమోహన్ కు పద్మశ్రీ అవార్డు ఇచ్చిన సందర్భంగా జానపద కళాకారుల సమక్షంలో సత్కరించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సాంస్కృతికబంధు, డా. అక్కినేని నాటక కళాపరిషత్ అధ్యక్షులు సాపల్లి కొండలరావు ,యువకళావాహిని అధ్యక్షుడు
లంక లక్ష్మీనారాయణ, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు వంగా శ్రీనివాస్ గౌడ్, , సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# 4న శ్రీకృష్ణ వేషధారణ పోటీలు



**చిక్కడపల్లి,ట్రైనెట్ న్యూస్, ఆగస్ట్ 31 :**
శ్రీ కృష్ణ జన్మాష్ట మిని పురస్కరించుకొని శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో బాల బాలికలకు శ్రీ కృష్ణ వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి జీ. కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 4వ తేదీన సాయంత్రం 4 గంటలకు శ్రీ త్యాయరాయ గానసభలోని కళా మారుతి మధ కళా వేదికలో బాల బాలికలకు శ్రీ కృష్ణ వేషధారణ పోటీలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. అదే రోజు సంగీత, నృత్యోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కృష్ణ తెలిపారు. శ్రీ కృష్ణ వేషధారణ పోటీలలో పాల్గొనే బాల బాలికలు ఆగష్టు 31వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మిగతా వివరాలకు 9494523562 ఫోన్ నెంబర్ కు సంప్రదించవచ్చని ఆయన వెల్లడించారు.

# 6న నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో "జిజ్ఞాస" నృత్య కార్యశాల



**హైదరాబాద్, చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్, ఆగస్ట్ 31:**
భారతీయ శాస్త్రీయ నృత్య రీతులలో విశిష్టతను తెలియజెప్పేందుకు, పరిశోధనా అంశాల ఎంపికపై, పత్ర రచనా పద్ధతి తదితర విషయాలపై అవగాహనను పెంపొందించేందుకు "జిజ్ఞాస" పేరిట ఒక నృత్య కార్యశాలను సెప్టెంబర్ 6, ఆదివారం నిర్వహించనున్నట్టు నవ్య నాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్తలు నిష్టల సుధామాల, మధుమతి కులకర్ణి పత్రికా విలేకరులకు సమితి కార్యాలయంలో తెలిపారు.
శ్రీ కృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయంలో జరిగే ఈ కార్యశాలలో నాట్య ప్రక్రియలపై పరిశోధనా విధానంలో ప్రామాణిక వ్యాసరచనా పద్ధతిపై ప్రముఖ నృత్య గురువు, అమెరికాలోని అరియ విశ్వవిద్యాలయం ఆచార్య వేలూరి సుమిత్ర సూచనలు చేస్తారని సుధామాల తెలిపారు.కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రిక ను సోమవారం నవ్య నాటక సమితి కార్యాలయం లో రాష్ట్ర ఖజానా లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర సమితి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వసుంధర మాట్లాడుతూ .. నృత్య రంగంలో ప్రామాణిక పత్ర రచన చేయాలనుకునే విశ్వ విద్యాలయ పరిశోధక విద్యార్థులకు, నృత్య కళాకారులకు ఈ కార్యశాల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.
భారతీయ శాస్త్రీయ నృత్య, సంగీత రంగాలలో కార్యశాలలను, ఉపన్యాస కార్యక్రమాలను నిర్వహిస్తూ, కళాకారులను ప్రోత్సహిస్తున్న నవ్య నాటక సమితి కార్యనిర్వాహక సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో
సమితి సభ్యులు డా. ఇందిరా హేమ, వేమరాజు రమాదేవి పాల్గొన్నారు.

# అలరించిన సినీ సుమధుర గీతాలు







**హైదరాబాద్, చిక్కడపల్లి, ట్రైనెట్ ఆగస్టు 31 :**
పల్లవి చరణ్ మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో 'సినీ సుమధుర గీతాలు' అనే అద్భుతమైన సంగీత విభావరిత్యాగరాయ గానసభలోని కళా లలిత కళా వేదికలో నిర్వహించారు. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. రమణారెడ్డి సారధ్యంలో గాయనీ గాయకులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి.

# గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి







**హైదరాబాద్, చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31**
గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'ఘంటసాల గాన వారస గోవింద శిఖామణి', మధుర గాయకులు 'గానరత్న' టి.గోవింద్ రావు గ సంగీత స్వరసారధ్యంలో
తేలితేలి నా మనసు తెలియకనే నావ వలె ఊగుచున్నది...." తెలుగు – హిందీ సినీ సంగీత విభావరి చిక్కడపల్లి శ్రీత్యాగరా గానసభ మెయిన్ హాల్ లో నిర్వహించారు. సంస్థ అధినేత టి.గోవింద్ రావు నిర్వహణలో ప్రముఖ గాయనీ , గాయకులు సినీ ప్లేబ్యాక్ సింగర్, చంద్రతేజ వి.ఎస్.సుందర్ రావు, ఆర్.శైలజ శ్రీనివాస్. టి.ఎస్.వాణి తదితరులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. సూర్యతేజ (కీబోర్డ్), కే.ఎస్.చక్రవర్తి (తబల),సతీష్ (ప్యా?స్) వాద్య సహకారం అందించారు . కార్యక్రమంలో కార్యదర్శి: టి.సాయికుమార్ పాల్గొన్నారు.

# హరికథ ప్రక్రియకు సాహిత్యం లో ఉన్నత స్థాయి కల్పించిన ఆదిభొట్ల







**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, ఆగస్టు 31:**
హరికథా ప్రక్రియకు సాహిత్యం లో ఉన్నత స్థాయి కల్పించిన అదిభొట్ల నారాయణ దాసు ఆ ప్రక్రియకు భీష్మచార్యులు వంటి వారని రాష్ట్ర హస్త కళల సంస్థ చైర్మెన్ నాయుడు సత్యనారాయణ అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు జయంతి సమావేశం గాన సభ నిర్వహణలో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ నారాయణ దాసు హరికథ కళా ప్రక్రియకు మార్గ దర్శి మాత్రమే కాక ఆయన కవీ శాస్త్రీయ సంగీత కళా కారుడు అని చెప్పారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై ప్రముఖ హరి కథకులు రామబట్టర్ కాకర్ల హనుమంత రావు గీతా దేవి డాక్టర్ జయ రాములు పాల్గొన్నారు

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136